ప్రభాత సమాచారం
https: epaper.
prabhathasamacharam.com
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
■ శుక్రవారం | 26 సెప్టెంబర్ 2025 | ■ 15 పేజీలు






## జల్ సంచయ్ జన్ భగీదారి అవార్డుకు
# నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాలు ఎంపిక

# ముంచెత్తిన ముసురు..
# ఎడతెరిపిలేని వర్షం
## ఉమ్మడి జిల్లాకు ఎల్లో అలర్ట్

- ప్రాజెక్టులకు పోటెత్తుతున్న వరద ■ ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి..
- ఉప్పొంగుతున్న వాగులు.. వంకలు ■ పిడుగు పాటుకు మాడిపోయిన పత్తి
- బాసర వద్ద గోదావరి ఉగ్రరూపం ■ నీట మునిగిన పత్తి, వరి పంటలు
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు ■ బొగ్గు ఉత్పత్తికి ఆటంకం..



అల్పపీడన ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ముసురు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను ముంచెత్తుతున్నది. బుధవారం రాత్రి నుంచి వర్షం పడుతుండగా, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రాజెక్టుల్లోకి భారీగా వరద వచ్చి చేరుతుండగా, గేట్లు ఎత్తి దిగువకు వదులుతుండడంతో వాగులు వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పంట పొలాలు నీట మునిగాయి. గ్రామీణ ప్రాంతాలు చిత్తడిగా మారాయి. మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా గురువారం ఉదయం వరకు 26.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలో తెల్లవారుజామున నుచి ఏకధాటిగా వర్షం కురిసింది. ఆదిలాబాద్ జిల్లాలోని ఇచ్చోడలో 14 సెం.మీ.లు, ఉట్నూర్‌లో11.3, బేల మండలం చెప్రాలలో10 సెం.మీ.ల వర్షపాతం నమోదు అయ్యింది. ఇచ్చోడ మండలం ముఖరా (బి) గ్రామ శివారులో పత్తి చేనులో పిడుగు పడడంతో సుమారు 200కు పైగా పత్తి మొక్కలు మాడిపోయాయి. మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో అక్కడి ప్రాజెక్టుల నుంచి విడుదల చేస్తున్న నీటితో నిర్మల్ జిల్లా బాసర వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో పుష్కర ఘాట్ల వద్దకు రాకపోకలు నిషేధించారు. ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టుల్లో బొగ్గు ఉత్పత్తి చేసే భారీ యంత్రాలు పని స్థలాల్లోనే ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. రాత్రి నుంచి కురుస్తున్న వర్షంతో ఓసీపీల్లోకి వరదనీరు చేరడంతో బొగ్గు ఉత్పత్తికి ప్రతికూల పరిస్థితి ఏర్పడింది.



వివరాలు లోపలి పేజీల్లో



2

### అసాంఘిక కార్యకలాపాలకు
## అడ్డుకట్ట వేసేందుకు కార్డన్ సెర్చ్

- వర్షాన్ని లెక్క చేయకుండా 160 మంది సిబ్బందితో కేశవపట్నంలో కార్డన్ సెర్చ్
- 82 బైకులు, 18 ఆటోలు స్వాధీనం ■ నార్కోటిక్ డాగ్ 'రోమా'తో తనిఖీలు..
- గంజాయి సాగు చేస్తే కఠిన చర్యలు తప్పవు ■ ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్

ప్రజల సంరక్షణ, భద్రత కోసం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. గురువారం ఇచ్చోడ మండలం కేశవపట్నం గ్రామంలో భారీ వర్షాన్ని సైతం లెక్క చేయకుండా 160 మంది సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ఉట్నూర్ అదనపు ఎస్పీ కాజల్ సింగ్, డిఎస్పీ జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముల్తానీ కుటుంబాలకు చట్టాలపై అవగాహన కల్పించారు.

### కుష్మండ అవతారంలో
## సరస్వతీ అమ్మవారు

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం చదువుల తల్లి కొలువుదీరిన బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవి సన్నిధిలో శరదియా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతు న్నాయి. నాల్గవ రోజు అమ్మవారు కూష్మాండా అవతారంలో దర్శనమిచ్చారు.





15

# గులాబి గూటికి కోనప్ప బ్రదర్స్

- కాంగ్రెస్ పార్టీలో చేరి ఏడాది కూడా పూర్తి కాకుండానే గుడ్‌బై చెప్పిన కోనప్ప
- సిర్పూర్ నియోజకవర్గంలో కలకలం..
- తూర్పు జిల్లాలో మారనున్న సమీకరణలు
- ఆర్ఎస్పీతో సయోధ్య కుదిరేనా..?
- అభివృద్ధిని అడ్డుకుంటున్నారన్న కోనప్ప

సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, ఆయన సోదరుడు, మాజీ జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణా రావు బీఆర్ఎస్‌లో చేరారు. హైదరాబాద్‌లోని ఎర్రవెల్లిలోని ఫాం హౌస్‌లో గురువారం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్‌రావు సమక్షంలో చేరగా, వారు పార్టీ కండు వాలు కప్పి ఆహ్వానించారు. గతేడాది సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కోనప్ప కాంగ్రెస్‌లో చేరారు. ఏడాది పూర్తి కాకుండానే అధికార పార్టీని వీడారు.



### విదేశాల్లో ఉంటూ..
## రెచ్చగొట్టేలా పోస్టు

- ముంబై ఎయిర్ పోర్ట్‌లో నిందితుడి పట్టివేత
- పాస్‌పోర్ట్, రెండు పోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి

### గడువుతీరిన..
## మందులను ఇవ్వొద్దు

- మెరుగైన వైద్య సేవలందించాలి..
- దంతనపల్లి పీహెచ్‌సీని తనిఖీ చేసిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ - 15





# రేషన్ డీలర్ల సమస్యలు తీరేదెన్నడు...?

- హామీలతోనే ఏళ్లతరబడి జాప్యం
- వినతులు పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం
- గౌరవ వేతనం డిమాండ్ బుట్టదాఖలు
- నెలవారీ కమీషన్లూ జమకాని వైనం
- నెలంతా కష్టపడితే మిగిలేది రిక్తహస్తాలే

**ముథోల్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**

రేషన్ డీలర్లు అనేక సమస్యలతో కొట్టు మిట్టాడుతున్నారు. పాలకులకు ఏళ్ల తరబడి మొర పెట్టుకుంటున్నా మోక్షం లభించడం లేదు. నెల రోజులు శ్రమ పడితే చివరకు మిగిలేది రిక్త హస్తాలేనన్న అభిప్రాయాలు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సమస్యలు తీరుతాయని గంపెడు ఆశలు పెట్టుకున్న డీలర్లకు నిరాశే ఎదురైంది. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో డిమాండ్‌లు తీరుస్తామనే హామీలు డీలర్లను ఊరిస్తూ వచ్చాయి. ఏ ఒక్క సమస్యా తీరలేదు. ఎన్నికల హామీల్లో భాగంగా కాంగ్రెస్ డీలర్లకు హామీలు గుప్పించింది. రేషన్ డీలర్లకు గౌరవ వే తనం కల్పిస్తామని మాటిచ్చింది. ఏడాది గడిచినా అది కార్యరూపం దాల్చలేదు. ఇలా ఎన్నో సమస్యలను పాల కులకు ఎప్పటికప్పుడు విన్నవిస్తున్నా, కనీసం చర్చలు జరపడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా పాలనలో కష్టాలు తీరుతాయనే నమ్మకం సన్నగిల్లుతోంది.

**గౌరవ వేతనం కోసం ఆందోళన....**

రేషన్ డీలర్ల ముందు ఉన్న ప్రధాన సమస్య గౌరవ వేతనం. నెలకు రూ. 30 వేల గౌరవ వేతనాన్ని ఇవ్వా లని డీల్లరు దశాబ్దకాలానికి పైగా పోరాడుతున్నారు. కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో గౌరవ వేతనం కల్పిస్తు న్నందున తెలంగాణలోనూ గౌరవ వేతనం ఇవ్వాలని పట్టు బడుతున్నారు. ఈ డిమాండ్‌పై గత ప్రభుత్వం డీలర్లకు న్యాయం చేస్తామని ప్రకటించింది. కానీ పదేళ్లలో ఈ అంశంపై బీఆర్ఎస్ ప్రభుత్వం పెదవి విప్పలేదు. ఇదిలా ఉండగా 2023లో జరిగిన ఎన్నికల సమయంలో కాంగ్రెస్ డీలర్లకు గౌరవ వేతనం హామీ ఇచ్చినట్లు డీలర్లు చెబుతున్నారు. రూ.5వేల గౌరవ వేతనం కల్పిస్తామనే హామీని ఎన్నికల మేనిఫెస్టోలో కూడా పొందు పరిచినట్లు అంటున్నారు. అయితే సం వత్సరం గడిచినా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గౌరవ వేతనం ఇవ్వాలని విన్నవిస్తున్నారు. ఈ విషయమై రెండు నెలల క్రితం హైదరాబాద్‌లో రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి, తమ డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచారు.

**సకాలంలో అందని కమీషన్లు....**

రేషన్ డీలర్లకు కమీషన్ డబ్బులు కూడా ప్రతినెల క్రమంగా అందడం లేదనే అభిప్రాయాలు ఉన్నాయి. తాజాగా ఐదు నెలలకు సంబంధించిన కమీషన్లు ఇంకా జమ కాలేదని డీలర్లు వాపోతున్నారు. నెలవారిగా డబ్బులు అందకపోవడంతో డీలర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్య మంత్రిగా ఉన్న సమయంలో 'అమ్మ హస్తం' పథకం అమలు చేశారు. బియ్యంతో పాటు చక్కెర, పప్పులు, నూనె ఇతర సరుకులు మొత్తంగా 9 నిత్యావసర వస్తువులను పంపిణీ చేసేవారు. ఇది డీలర్లకు కాస్త లాభ సాటిగానే ఉండేది. అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక రేషన్ షాపులు బియ్యం పంపిణీకే పరిమితమయ్యాయి. దీంతో కమీషన్లు గణనీయంగా తగ్గాయి. ఖర్చులు పెరగడం, కమీషన్లు తగ్గడంతో ఇబ్బందుల పాలవుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నందున అమ్మ హస్తం మాదిరిగా నిత్యావసరాల సరుకుల విక్రయంపై చర్యలు తీసుకోవాలని డీలర్లు వేడుకుంటున్నారు.

**మిగిలేది రిక్త హస్తాలే...**

ఖర్చులన్నీ పోనూ చివరకు మిగిలేది రిక్తహస్తాలే అని డీలర్లు ఆవేదన చెందుతున్నారు. దిగుమతి చార్జీలు సైతం తామే భరించడం వల్ల ఏమీ మిగలడం లేదంటున్నారు. ఒక్కోసారి తామే అదనంగా భరించాల్సిన దుస్థితి ఏర్పడుతుందనేది డీలర్ల వాదన. ఒక డీలర్ వంద క్వింటాళ్ల బియ్యం బస్తాలను దిగుమతి చేసుకుంటే రవాణా, డ్రైవర్, కూలీ మొత్తంగా రూ.2వేల వరకు భరించాల్సి వస్తోందని చెబుతున్నారు. వంద క్వింటాళ్ల బియ్యాన్ని విక్రయిస్తే క్వింటాలుకు రూ.140 చొప్పున మొత్తంగా రూ.14 వేలు కమీషన్ రూపంలో డీలర్‌కు లభిస్తుంది. ఈ ఆదాయంలో షాపు అద్దె, వి ద్యుత్ చార్జీలు, హమాలీ కూలీలు, ఇతరత్రా ఖర్చుల చెల్లింపులు జరిగితే ఏమీ మిగలడం లేదని చెబుతున్నారు. ఈ క్రమంలో దిగుమతి చార్జీలు మరో భారంగా మారాయంటున్నారు. దీనిని ప్రభుత్వం గుర్తించి దిగుమతి చార్జీలను భరించాలని డిమాండ్ చేస్తున్నారు. దీని ద్వారా డీలర్‌కు నెలకు రూ.2 వేలు మిగిలే అవకాశం ఉంటుందంటున్నారు. ఇక ఎంఎల్ఎస్ పాయింట్లలో కాంటా సరిగ్గా ఉండక తూకంలో తక్కువ బియ్యం వస్తున్నాయని, బస్తాకు రెండు కిలోల బియ్యం తక్కువగా వస్తున్నాయని డీలర్లు చెబుతున్నారు.



## ఎడతెరిపి లేని వర్షంతో
# రైతుల ఆందోళన

**మామడ, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**

మండలంలోని ఆయా గ్రామాల్లో గత రెండు రోజుల నుంచి కురుస్తున్న అకాల వర్షాలతో మొక్కజొన్న పంట తడిసిపోయింది. అహర్నిశలు కష్టపడి పండించిన మొక్కజొన్న పంట అకాల వర్షంతో తడిసిపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మొక్కజొన్నను కాపాడుకోవడానికి కొంతమంది రైతులు కవర్లు కప్పిన కింది నుంచి వర్షపు నీరు చేరడంతో తడిసిపోయాయని, మొన్నటి వరకు కోతులు, పందుల బెడదతో పంటచేళ్లలో పస్తులు ఉంటూ, కాపలా ఉండి మొక్కజొన్న పంటను కాపాడుకున్నామని, చేతికి వచ్చే సమయంలో వర్షాలు కురవడంతో రోడ్డుకు ఇరువైపులా ఆరబెట్టిన మొక్కజొన్న తడిసిపోవడంతో పెట్టిన పెట్టుబడి వెళ్లక, చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదని రైతులు వాపోతున్నారు. తడిసిన మొక్కజొన్న కంకులు మొలకెత్తుతుండడంతో కర్షకుల కష్టం నీటి పాలవుతుందని దిగులు చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తడిసిన మొక్కజొన్నను కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

## 26, 27 తేదీలలో
# మహనీయుల జయంతి వేడుకలు

**మంచిర్యాల, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**

జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఈ నెల 26వ తేదీన ఉదయం 9:30కు చాకలి ఐలమ్మ జయంతి, 27వ తేదీన ఉదయం 9:30కు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, సంఘాల నాయకులు అధిక సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

# అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు కార్డన్ సెర్చ్







- కేశవపట్నంలో ఎస్పీ ఆధ్వర్యంలో కార్డన్ అండ్ సెర్చ్
- 82 బైకులు, 18 ఆటోలు స్వాధీనం..
- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**ఇచ్చోడ, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**

ప్రజల సంరక్షణ, భద్రతకై కమ్యూనిటీ కాంటాక్ట్ (కార్డన్ అండ్ సెర్చ్) కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. గురువారం ఇచ్చోడ మండలం కేశవపట్నం గ్రామంలో భారీ వర్షాన్ని లెక్క చేయకుండా 160 మంది సిబ్బందితో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉట్నూర్ అదనపు ఎస్పీ కాజల్ సింగ్ ఐపీఎస్, ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముల్తానీ కుటుంబాలకు ఉన్నత విద్య, సమాజ విలువలు, చట్టాలపై అవగాహన కల్పించారు. తనిఖీల్లో 82 బైక్‌లు, 18 ఆటోలు, ఒక మ్యాక్స్ వాహనం తాత్కాలికంగా స్వాధీనం చేసుకున్నారు. నార్కోటిక్ డాగ్ "రోమా" సహాయంతో గంజాయి కోసం తనిఖీలు నిర్వహించారు. గ్రామాన్ని సందర్శించిన ఎస్పీ అఖిల్ మహాజన్ విద్యార్థులకు చదువు ప్రాధాన్యతను తెలియజేశారు. చదువు వలన భవిష్యత్తు మెరుగవుతుందని, మంచి పేరు లభిస్తుందని సూచించారు. తల్లి దండ్రులు పిల్లలను చదువులో ప్రోత్సహించాలని కోరారు. ఒకే గ్రామం నుంచి గత ఐదేళ్లలో 90 కేసులు నమోదయ్యాయని గుర్తుచేస్తూ, ఇకపై సన్మార్గంలో నడవాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలలో పాల్గొనని వారి రౌడీ షీట్లు, సస్పెక్ట్ షీట్లు ఏడాదిపాటు పరిశీలన తర్వాత ఎత్తివేస్తామని తెలిపారు. అక్రమ కలప రవాణా, చెట్ల నరికివేత, గంజాయి సాగు వంటి వాటిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, రానున్న ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పూర్తి చేయడానికి అందరూ సహకరించాలని కోరారు. గ్రామాల్లో సీసీటీవీ కెమెరాల ప్రాధాన్యతను వివరించి వాటి ఏర్పాటుకు కృషి చేయాలని సూచించారు. మహిళల పట్ల గౌరవంగా ప్రవర్తించాలని, గృహహింస, ఈవ్‌టీజింగ్, వేధింపులకు పాల్పడకూడదని హెచ్చరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ పోతారం శ్రీనివాస్, ఇచ్చోడ సిఐ బండారి రాజు, ఉట్నూర్ సిఐ ఎం. ప్రసాద్, ఎస్సైలు వి. పురుషోత్తం, వి.సాయన్న, ఎల్. శ్రీకాంత్, ఇమ్రాన్, డి. రాధిక, పూజ, అన్వర్ ఉల్‌హక్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని మందమర్రి మండలం బొక్కల గుట్ట గ్రామం గాంధారి ఖిల్లా సమీపంలోని చెరువుకు గండి పడినందున మందమర్రి మండల తహసిల్దార్ సతీష్, నీటిపారుదల శాఖ డి.ఈ. శారద లతో కలిసి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వర్షాలు కురుస్తున్నందున ఏర్పడే వరద పరిస్థితులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. చెరువుకు పడిన గండి కారణంగా పోతున్న నీటి వలన ఎలాంటి ప్రమాదాలు ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వరద పరిస్థితులలో ప్రజలను అప్రమత్తం చేస్తూ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# నిండిన చెరువు.. మునిగి పైరు..!

**జన్నారం, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**

గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో హాస్టల్ తండా గ్రామ శివారులోని చెరువు నిండి పంటలు చేలు నీట మునిగాయి. రైతు బాదావత్ రామారావుకు చెందిన రెండు ఎకరాలు, బి. శ్రీకాంత్ ఒక ఎకరం, చందు 20 గుంటల్లో వేసిన పంటలు పూర్తిగా నీటిలో మునిగాయి. భారీ వర్షాల కారణంగా పంటలు దెబ్బతినడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.






# గిరిజనుల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా కృషి చేయాలి

■ కలెక్టర్ల వీడియోకాన్ఫరెన్సులో కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ కార్యదర్శి విభునాయర్



**నిర్మల్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**
పీఎం జన్‌మన్ కార్యక్రమంలోని అన్ని పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి విభునాయర్ కలెక్టర్లను ఆదేశించారు. పీఎం జన్ మన్ (ప్రధానమంత్రి జన్ జాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్) కార్యక్రమం అమలుపై గురువారం ఢిల్లీలోని తన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలోని పలువురు కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విభూ నాయర్ మాట్లాడుతూ, గిరిజన ప్రజల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పీఎం జన్ మన్ కింద ఆధార్ కార్డుల నమోదు, ఆయుష్ కార్డులు, జన్ ధన్ ఖాతాల వినియోగం, పక్కా గృహాల నిర్మాణం, పీఎం కిసాన్, కిసాన్ క్రెడిట్ కార్డులు, మౌలిక వసతుల కల్పన వంటి కార్యక్రమాలను కలెక్టర్లు పర్యవేక్షిస్తూ వేగవంతం చేయాలని సూచించారు. ఆది కర్మయోగి కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆయన ఆదేశించారు. అలాగే స్థల సేకరణ, మౌలిక వసతుల నిర్మాణ పురోగతి అంశాలను వివరంగా తెలుసుకున్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులతో మాట్లాడుతూ, పీఎం జుగా, దర్తి అబా, ఆది కర్మయోగి కార్యక్రమాల్లోని అన్ని పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. అర్హులైన కుటుంబాలను గుర్తించేందుకు పంచాయతీ కార్యదర్శులు సర్వే చేసి వివరాలను సంబంధిత యాప్‌లో నమోదు చేయాలని చెప్పారు. జిల్లాలోని 24 హాబిటేషన్లలో 771 పక్కా గృహాలు నిర్మించనున్నట్లు తెలిపారు. ఆది కర్మయోగి కింద 9 బ్లాకులు, 32 హాబిటేషన్లలో గిరిజన ప్రజల అభివృద్ధి కోసం ఐదేళ్ల ప్రత్యేక కార్యాచరణ అమలు పరుస్తామని చెప్పారు. అదేవిధంగా ఆది సేవా కేంద్రాలను ఏర్పాటు చేసి గిరిజన సమాజానికి నూతన అంగన్వాడీలు, వసతి గృహాలు, మల్టీ పర్పస్ సెంటర్లు, ప్రైమరీ పాఠశాలలు, రోడ్డు కనెక్టివిటీ వంటి మౌలిక వసతులను కల్పించేందుకు చర్యలు ప్రారంభించామని కలెక్టర్ వెల్లడించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**అతి భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి..**
అతి భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడ ప్రాణ నష్టం జరగడానికి వీలు లేదని కలెక్టర్ అన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో చేపట్టాల్సిన వరద నియంత్రణ చర్యలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధం చేయాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలకు సురక్షిత ప్రాంతాలకు తరలించి వారికి అవసరమైన వైద్యం, ఆహారం ఇతర ఏర్పాట్లు చేయాలన్నారు. వరదల గురించి ప్రజలకు సామాజిక మాధ్యమాల్లో, ఎఫ్ఎం రేడియో, వివిధ మాధ్య మాల ద్వారా ముందస్తు సమాచారం అందించాలన్నారు. వరదల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించాలన్నారు. అత్యవసర సమయాల్లో పిర్యాదు చేసేందుకు కలెక్టర్ కార్యాలయంలో టోల్ ఫ్రీనంబర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

# బ్యాంకర్లు మెరుగైన సేవలు అందించాలి





## నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**
బ్యాంకులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన ఆర్థిక సంవత్సరపు మొదటి త్రైమాసిక జిల్లా కన్సాలిటేటివ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ రుణ పథకాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడానికి బ్యాంకర్లు, అధికారులు కలిసి పనిచేయాలని సూచించారు. వెనుకబడిన తరగతుల ప్రజలు, మహిళా స్వయం సహాయక సంఘాలు, రైతులు, వీధి వ్యాపారులు, విద్యార్థులకు రుణ మంజూరులో ఆలస్యం చేయకుండా చూడాలని ఆదేశించారు. అర్హులైన దరఖాస్తుదారులకు తప్పనిసరిగా రుణాలు అందజేయాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు బ్యాంకు సిబ్బంది అవగాహన కల్పించాలని, విస్తృత అవగాహన ద్వారానే సైబర్ నేరాలను నియంత్రించవచ్చని పేర్కొన్నారు. ప్రజలకు ఇప్పటివరకు బ్యాంకుల ద్వారా అందజేసిన రుణాల వివరాలు, వివిధ అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. బ్యాంకులకు వచ్చే ప్రతి ఒక్కరికీ సమయానుకూలంగా, మెరుగైన సేవలు అందించాలన్నారు. సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ గోపాల్, నాబార్డు డిడిఎం వీరభద్రుడు, ఆర్బీఐ ఏజీఎం శ్రీనివాస్, అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.



## రిజర్వేషన్ ప్రకారం మద్యం దుకాణాల కేటాయింపు

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**
జిల్లాలోని 73 ఏ4 మద్యం దుకాణాలలో డ్రా పద్ధతిన ఎస్.సి, ఎస్.టి, గౌడ కులస్తులకు రిజర్వేషన్ ప్రకారం మద్యం దుకాణాలను కేటాయించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా ఆబ్కారీ– మద్య నిషేధ, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి, జిల్లా గిరిజన అభివృద్ధి శాఖల అధికారులతో కలిసి మద్యం షాపుల రిజర్వేషన్ సంబంధిత డ్రా కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 73 ఏ4 మద్యం దుకాణాలలో రిజర్వేషన్ ప్రకారం మద్యం దుకాణాలను డ్రా పద్ధతిన ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతమైన మందమర్రి మున్సిపల్ ప్రాంతంలోని 6 మద్యం దుకాణాలను డ్రా పద్ధతిన కాకుండా షెడ్యూల్డ్ తెగల అభ్యర్థులకు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఎస్.సి. లకు 11, 22, 26, 36, 42, 45, 61, 64, 65, 67 నంబర్లు గల దుకాణాలు, గౌడ కులస్తులకు 9, 13, 29, 31, 37, 59 నంబర్లు గల దుకాణాలను రిజర్వేషన్ ప్రకారం డ్రా పద్ధతిన కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## యూరియా వస్తే సమచారం ఇస్తాం

**బెజ్జూర్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**
బెజ్జూర్ మండలంలో ప్రస్తుతం యూరియా అందుబాటులో లేదని, రైతులు యూరియా కోసం వచ్చి ఇబ్బందులు పడొద్దని ఏవో నాగరాజు కోరారు. మళ్ళీ యూరియా మండలానికి రాగానే రైతులందరికి సమాచారం అందించి అందజేస్తామన్నారు. మండలంలోని రైతులు గమనించి అధికారులకు సహకరించాలని కోరారు.



## ప్రజలను అప్రమత్తం చేసేందుకే కార్డెన్ సెర్చ్ ముఖ్య ఉద్దేశం

### సైబర్ నేరల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### బైంసా రూరల్ సీఐ నైలు

**కుభీర్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**
సమాజంలో నానాటికి పెరిగిపోతున్న నేరాల నియంత్రణలో భాగంగా ప్రజలు అప్రమత్తం చేసేందుకు గ్రామాలల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు భైంసా రూరల్ సీఐ నైలు నాయక్ పేర్కొన్నారు. నిర్మల్ జిల్లా కుభీర్ మండలం నిగ్వా గ్రామంలో గురువారం జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు కుభీర్ ఎస్సై కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బృందాలు గ్రామంలో తనిఖీలను నిర్వహించారు. ఈ తనిఖీలో 120 బైకులు, 4 ఆటోలను సీజ్ చేసి సరైన పత్రాలు లేని, నంబర్ ప్లేట్లు లేని వాహనాలకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా సిఐ గ్రామ ప్రజలకు సీసీ కెమెరాల ఆవశ్యకత, సైబర్ క్రైం, గ్రామాల్లోకి వచ్చే అనుమానిత వ్యక్తుల విషయంలో అవగాహన కల్పించారు. సైబర్ క్రైమ్ బాధితులు 1930 టోల్ ఫ్రీ నెంబర్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలు ఐక్యమత్యంగా ఉంటూ శాంతియుతంగా మెలగాలని, అప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుంచెట్టి లక్ష్మీరాజు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు దొంతుల దేవిదాస్, దత్తు, పోలీసులు, గ్రామస్థులున్నారు.



## చినుకు పడితే వణుకే.. తడిచిపోతున్న రికార్డులు, ఇతర సామగ్రి

**జన్నారం, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**
జన్నారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో చిన్నపాటి వర్షానికి కార్యాలయంలోని గదులు ఊరుస్తున్నాయి. దీనివల్ల అధికారుల విధులకు ఆటంకం ఏర్పడుతుంది. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. చిన్న వర్షానికి రెవెన్యూ కార్యాలయం భవనం స్లాబ్ నీరు నిలిచి ఊరుస్తుండడంతో భూభారతిలో, విద్యార్థుల సర్టిఫికెట్ల కొరకు వచ్చే ప్రజలు నానా ఇబ్బందులు పడుతు న్నారు. కార్యాలయంలో రికార్డు గది ఊరవడంతో రికార్డులు తడిసిపోయే ప్రమాదం ఉంది. ఇలా కార్యాలయం చిన్న వర్షానికి ఊరవడంతో అధికారులు ప్రజలకు తమ సేవలను అందించలేకపోతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి నూతన కార్యాలయాన్ని నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.






## ఇందిరమ్మ ఇండ్ల మార్క్ అవుట్
# ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలి

### నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)
జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అనుమతి పొందిన ప్రతి ఇంటికి సంబంధించిన మార్క్ అవుట్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు దశల వారీగా నిరంతరంగా కొనసాగాలని స్పష్టం చేశారు. మార్క్ అవుట్, బేస్‌మెంట్ తదితర దశల్లో పూర్తయిన ఇండ్ల వివరాలను సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన మాన్‌పవర్ ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, మార్క్ అవుట్ పూర్తయ్యి ఇంకా పనులు ప్రారంభించని వారు ఉంటే వెంటనే నిర్మాణం మొదలయ్యేలా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, హౌసింగ్ అధికారులు పనులను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. నిర్మాణానికి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న లబ్ధిదారులను గుర్తించి మహిళా సంఘాల ద్వారా రుణాలు కల్పించేలా చూడాలని, ఇసుక కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా, ప్రధానమంత్రి ఆవాస్ యోజనకు సంబంధించిన లబ్ధిదారుల ఎంపిక సర్వేను తక్షణమే పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు నిర్వహిస్తున్న సర్వేను ఎంపీడీవోలు పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, హౌసింగ్ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.






## టీచర్స్ ఎక్సలెన్స్ అవార్డు
# అందుకున్న సతీష్


లక్షెట్టిపేట, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)
మండలంలోని జెండా వెంకటాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బయాలజీ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న చీర్ల సతీష్ నేషనల్ టీచర్స్ ఎక్సలెన్స్ 2025 అవార్డు కి ఎంపికై హైదరాబాద్‌లోని బిర్లా సైన్స్ సెంటర్ లోని భాస్కర ఆడిటోరియంలో అవార్డు గురువారం అందుకున్నారు. నేషనల్ టీచర్స్ ఎక్సలెన్స్ అవార్డు శారద ఎడ్యుకేషనల్ సొసైటీ ఈ అవార్డును ప్రదానం చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా డీఈవో యాదయ్య మాట్లాడుతూ... విద్యార్థుల్లో ఇన్నోవేటివ్ అంశాల పట్ల ఆసక్తి పెంచుతూ వినూత్న రీతిలో బోధన చేస్తూ విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్రోల్మెంట్ పెంచేందుకు కృషి చేసినందుకుగాను ఈ అవార్డు అందజేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత చీర్ల సతీష్‌ను జిల్లా విద్యాధికారి, యాదయ్య, మండల విద్యాధికారి శైలజ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు యశోధర, ఉపాధ్యాయులు అభినందించారు.

# కళ్యాణ లక్ష్మి చెక్కులను సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)
కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో షాదీముబారక్, కళ్యాణ లక్ష్మి పథకాలకు ఆర్థిక సాయంతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పి ప్రభుత్వం వచ్చి రెండేళ్లు అయినా లబ్ధిదారులకు బంగారం ఇవ్వడంలో విఫలమైందని ఎమ్మెల్యే కోవ లక్ష్మి విమర్శించారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 93 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. వీటితోపాటు సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తులం బంగారం కూడా అందజేయాలన్నారు. లక్ష రూపాయల నగదుతో పాటు తులం బంగారం తమ ఆడబిడ్డ పెళ్లికి వస్తుందని ఎంతో ఆశతో ఓట్లు వేస్తే ఇప్పుడు మాత్రం దాని ఊసే ఎత్తడం లేదన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలిబిన్‌హైమద్ తదితరులు పాల్గొన్నారు.



# మేడి చెరువుకు గండి.. ఆయకట్టు రైతుల ఆందోళన




మందమర్రి, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)
అకసాయి పంట పొలాల రైతుల బాధలు అంతా ఇంత కాదు. పంట వేసినప్పటి నుండి కోత సమయం వరకు పంట పండించడానికి కావలసిన నీటి కోసం తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. వర్షాలు సమృద్ధిగా కురిస్తేనే చెరువులు నిండి పంటలు పండుతాయని గంపెడు ఆశతో ఉన్న రైతులకు చెరువులు మరమ్మతులకు నోచుకోక పోవడంతో కట్టలకు గండ్లు పడి చెరువులోని నీరంతా బయటకు వృధాగా పోవడంతో దిక్కు తోచని పరిస్థితుల్లో పంట ఎలా చేతికి వస్తుందని రైతులు దిగులు చెందుతున్నారు. ఇలాంటి సమయంలోనే చెరువుకు గండి పడి పంటల సాగు ప్రశ్నార్థకమేన అనే పరిస్థితి నెలకొంది. మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం బొక్కల గుట్ట మేడి చెరువు కట్టకు గండి పడి నీరంతా వృధాగా పోతుంది. 100 ఎకరాల వరకు సాగునీరు అందించే చెరువుకు గండి పడటంతో రైతన్నలు దిక్కుతోచని దీనస్థితిలో ఆందోళన చెందుతున్నారు. రెండేళ్లుగా చెరువు తూముతో సహా కట్టలు కూడా బాగు చేయాలని అధికారుల వద్ద రైతులు మొర పెట్టుకున్న పుటికీ పట్టించుకున్న నాథుడు లేదని వాపోయారు. మండల పరిషత్ సమావేశాల్లో చెరువు ప్రస్తావన తీసుకు వచ్చినా అధికారులు పట్టించుకోలేదని అన్నారు. నీటి ప్రవాహంతో మరమ్మతుకు నోచుకోకుండా తూము వద్ద గండిపడడంతో నీరంతా బయటకి వెళ్లిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.



## విద్యార్థుల సౌకర్యార్థం చేపట్టిన
# పనులను వేగవంతం చేయాలి

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

చెన్నూర్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)
ప్రభుత్వ విద్యా సంస్థలలో విద్యార్థుల సౌకర్యార్థం చేపట్టిన పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని చెన్నూర్ మండలం కిష్టంపేటలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించి కళాశాల పరిధిలో కొనసాగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని అభివృద్ధి చేసి విద్యార్థులకు సకల సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. చెన్నూర్ మండల కేంద్రంలో గల గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల (ఇ/మీ) పరిధిలో జరుగుతున్న నిర్మాణం పనులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి మోహన్ తో కలిసి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసే విధంగా పర్యవేక్షించాలని, గుత్తేదారుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణతో కలిసి చెన్నూర్ పట్టణంలో కొనసాగుతున్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించి పనులను వేగవంతం చేయాలని తెలిపారు. స్థానిక ప్రజలకు వేగవంతమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఈ క్రమంలో పనులు త్వరగా పూర్తిచేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. అమృత్ 2.0 పథకం క్రింద చేపట్టిన వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను పరిశీలించారు. అమృత్ 2.0 పథకంలో ట్యాంకుల ద్వారా ప్రతి ఇంటికి నీటిని అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.



# డ్రా పద్ధతిన రిజర్వేషన్ ప్రకారం మద్యం దుకాణాల కేటాయింపు

### ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)
జిల్లాలోని 40 ఏ 4 మద్యం దుకాణాలకు డ్రా పద్ధతిన ఎస్.సి, ఎస్.టి, గౌడ కులస్తులకు రిజర్వేషన్ ప్రకారం మద్యం దుకాణాలను కేటాయించడం జరిగిందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎక్సైజ్ శాఖ, జిల్లా షెడ్యూల్ కులాల, జిల్లా వెనుకబడిన తరగతుల, జిల్లా గిరిజన అభివృద్ధి శాఖల అధికారులతో కలిసి మద్యం షాపుల రిజర్వేషన్ సంబంధిత డ్రా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 40 ఏ4 మద్యం దుకాణాలలో రిజర్వేషన్ ప్రకారం మద్యం దుకాణాలను డ్రా పద్ధతిన ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. ఎస్.సి లకు 1, 4, 18, 21, 28. నంబర్లు గల దుకాణాలు, గౌడ కులస్తులకు 25 నంబర్లు గల దుకాణాలను, రిజర్వేషన్ ప్రకారం డ్రా పద్ధతిన కేటాయించడం జరిగిందని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో 9 షాప్‌లను ఎస్టీకి కేటాయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సంబంధిత శాఖాధికారులు పాల్గొన్నారు.





# మద్యం దుకాణాల టెండర్లకు నోటిఫికేషన్

- లక్కీడ్రా పద్ధతిన రిజర్వేషన్ల ప్రకారం కేటాయింపు
- జిల్లాలో 32 మద్యం దుకాణాలు
- డ్రా తీసిన జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే



**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వం మద్యం దుకాణాల గెజిట్ నోటిఫికేషన్ను గురువారం జారీ చేసింది. జిల్లాలో 32 మద్యం దుకాణాలకు టెండర్లను ఆహ్వానించనున్నారు. గతంలో నాన్ రిఫండబుల్ గా ఉన్న రూ. 2 లక్షలు ఉన్న దరఖాస్తు రుసుం రూ. 3 లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. మద్యం దుకాణాలలో ఎస్టీ, ఎస్సీ, గౌడ్ కులస్తులకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించనున్నారు. ఈ రిజర్వేషన్ ప్రకారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఆధ్వర్యంలో ఎక్సైజ్ శాఖ అదికారులు లక్కీ డ్రాలో రిజర్వేషన్ల ప్రకారం మద్యం దుకాణాలను కేటాయించారు. కొత్త మద్యం పాలసీ ఈ ఏడాది డిసెంబరు 1 నుంచి నవంబరు 30, 2027 వరకు అమలులో ఉంటుంది. రెండేళ్ల పాటు ఈ కొత్త పాలసీ మద్యం విదానం షాపులు పని చేస్తాయి. శుక్రవారం నుంచి అక్టోబరు 18 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అక్టోబరు 23న లక్కీ డ్రా ద్వారా మద్యం దుకాణాల ఎంపిక చేపట్టనుంది. జనాభా ఆధారం గా మద్యం దుకాణాల స్లాబ్లను నిర్ణయించింది. ఐదువేల లోపు జనాభా కలిగి ఉన్న ప్రాంతాల్లో దరఖాస్తు ఫీజు రూ. 50 లక్షలు, ఐదువేల నుంచి 50వేల జనాభా కలిగిన ప్రాంతాలలో రూ. 55 లక్షలు, 50 వేల నుంచి లక్ష జనాభా కలిగి ఉన్న ప్రాంతాలలో రూ. 60 లక్షలు దరఖాస్తు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. లక్ష నుంచి ఐదు లక్షల జనాభా కలిగిన ప్రాంతాలలో రూ. 65 లక్షలు, ఐదు లక్షల నుంచి 20 లక్షల జనాభా కలిగిన ప్రాంతాలలో రూ.85 లక్షలు,20 లక్షలకుపైగా జనాభా కలిగిన ప్రాంతాల్లో రూ.1.10కోట్లు దరఖాస్తు ఫీజును ప్రభుత్వం నిర్ణయించింది.

**రిజర్వేషన్ల ప్రకారం..**
జిల్లాలో లక్కీ డ్రా పద్ధతిన రిజర్వేషన్ల ప్రకారం మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియ ను గురువారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే నిర్వహించారు. 2025-2027 సంవత్సరానికి గాను జిల్లాలోని 32 మద్యం దుకాణాలకు గాను నాలుగు ఎస్సీ, ఎస్టీ ఒకటి, గౌడ కులస్తులకు రెండు రిజర్వేషన్ ప్రకారం దుకాణాలను కేటాయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 32 మద్యం దుకాణాలలో రిజర్వేషన్ ప్రకారం మద్యం దుకాణాలను డ్రా పద్ధతిన ఎంపిక చేశామని చెప్పారు. ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలో షాప్నెంబరు 1,4, కాగజ్నగర్ మున్సిపల్ పరిధిలో షాప్నెంబరు1, సిర్పూర్(టి)లో ఒకటి, మొత్తం 4షాపులు షెడ్యూల్ కులాల వారికి, రెబ్బెన మండలం గోలేటి, బెజ్జూరు మండల కేంద్రంలోని షాపులను గౌడ కులస్తులకు, కౌటాల మండల కేంద్రంలోని ఒక షాపు ఎస్టీలకు కేటాయించామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డేవిడ్, జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతి కిరణ్, డీడీ రమాదేవి, జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి సజీవన్ తదితరులు పాల్గొన్నారు.



## దీన్ దయాల్ జయంతి వేడుకలు

**నిర్మల్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**
దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి కార్యక్రమం స్థానిక బిజెపి కార్యాలయంలో నిర్వహించారు. పండిత్ దీనదయాళ్ ఉపాధ్యాయ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ మాజీ అధ్యక్షుడు, భారతీయ జనతా పార్టీ హైందవ రాష్ట్రం సిద్ధాంతకర్త ఏకాత్మ మానవవాదం ప్రవచించి సమాజంలో అట్టడుగున ఉన్న వ్యక్తికే ప్రభుత్వ పథకాల్లో తొలి ప్రయోజనం చేకూరాలన్న అంత్యోదయ విధానాన్ని పొందించిన విధానకర్త అని వారి యొక్క ఆశాలను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అమలు చేస్తున్నారని నాయకులు అన్నారు.

## అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలి

**జన్నారం, ఎస్సై గొల్లపల్లి అనూష**




**జన్నారం, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**
జన్నారం మండలంలోని కొన్ని గ్రామాల్లో చెడ్డీ గ్యాంగ్ పేరుతో కొంతమంది అనుమానితులు తిరుగుతున్నారని వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాల ఎస్సై గొల్లపల్లి అనూష అన్నారు. గురువారం పోలీస్ స్టేషన్ లో విలేకులతో మాట్లాడారు. సద్దుల బతుకమ్మ, దసరా సందర్భంగా మహిళలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులు ఎక్కడ కనబడిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

## ఘనంగా బతుకమ్మ సంబరాలు

**ముథోల్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**
ముధోల్ మండలంలోని చించాల గ్రామాలలో గురువారం సాయంత్రం బతుక మ్మ సంబురాలను ఘనంగా జరుపుకొన్నారు. గునుగు,టేకు పువ్వు, తంగేడు, బంతి రకరకాల పూలను సేకరించి మహిళలు, పిల్లలు, బతుకమ్మలను అందంగా పేర్చి, పూజలు చేశారు. ముందుగా హనుమాన్ మందిరంకు వెళ్లి పూజలు చేశారు. అలాగే పెద్దమ్మతల్లిమందిరం, దుర్గా మాత మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆనంతరం గ్రామంలో ఆయా విధుల గుండా బతుకమ్మ పాటలతో ఊరేగింపు నిర్వహించారు. బతుకమ్మ ఆటపాటలతో గౌరమ్మను కొలిచారు. అంతా ఒక్కచోట చేరి బతుకమ్మ సంబురాలు చేసుకున్నారు. కోలాటాలు ,బతుకమ్మ పాటలతో మార్మోగింది. సమీపంలోని చెరువులో బతుకమ్మలను భక్తి శ్రద్ధలతో నిమజ్జనం చేశారు.



# కానిస్టేబుల్ నుండి అసిస్టెంట్ ట్రెజరర్ ఆఫీసర్

### నాలుగు కొలువులు సాధించిన శశిధర్ రెడ్డి

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ పట్టణానికి చెందిన యువకుడు సరసన్ శశిధర్ రెడ్డి చిన్ననాటి నుండి కష్టపడి చదివి వివిధ ప్రభుత్వ ఉద్యోగాలు సాధిస్తూ వస్తున్నాడు. తాజాగా గ్రూప్ 1 ఫలితాల్లో తన ప్రతిభ కనబర్చి మరొక కొలువు కొట్టేశాడు. మొత్తం నాలుగు కొలువులు సాధించి ఔరా అనిపిస్తున్నాడు. స్వగ్రామమైన భోరజ్ మండలం పిప్పర్వాడకు చెందిన సరసన్ రాజీవ్ రెడ్డి, లక్ష్మీ దంపతులు కుమారుడు శశిధర్ రెడ్డి చిన్నప్పటి నుండి ఎలాగైనా ఉద్యోగం సాధించాలానే తపనతో పట్టుపట్టారు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా నాలుగు ఉద్యోగాలు సాధించాడు. 2016 సంవత్సరంలో ఎక్సైజ్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు. కానీ విధుల్లో చేరలేదు. 2017 సంవత్సరంలో ఫైర్ కానిస్టేబుల్గా ఉద్యోగం సాధించి విధుల్లో చేరాడు. మళ్ళీ 2024 సంవత్సరంలో గ్రూప్ ఫోర్ ఉద్యోగం సాధించాడు.



కానీ వెళ్ళలేదు. 2017లో సాధించిన ఫైర్ కానిస్టేబుల్ ఉద్యోగంలో చేరి విధులు నిర్వర్తిస్తూనే పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యాడు. 8 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తునే తాజాగా విడుదలైన గ్రూప్ 1 ఫలితాల్లో అసిస్టెంట్ ట్రెజరర్ ఆఫీసర్ ఉద్యోగం సాధించాడు. ఉద్యోగం సాధించి మల్టీ జోన్ వన్కు ఎంపికయ్యాడు. దింతో ఆయన ఆనందానికి హద్దు లేవు. ఉద్యోగం సాధించడంలో తల్లిదండ్రులు, భార్య సహకారం, అక్క స్వాతి ప్రోత్సాహం ఎంతగానో లభించిందని శశిధర్ పేర్కొన్నారు.



## టెట్ పరీక్షపై ఉపాధ్యాయులు ఆందోళన చెందవద్దు

**నిర్మల్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**
టెట్పై ఎలాంటి ఉపాధ్యాయులు ఆందోళన అవసరం లేదని ఎస్టీయూ టియస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి. రవి, జి.సదానందం గౌడ్లు అన్నారు. స్థానిక పెన్షనర్ల సంఘ భవనంలో జిల్లా అధ్యక్షుడు ఎస్. భూమన్న యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన ఎస్టీయూ సమావేశానికి హాజరయ్యారు. సంఘ వార్షిక కౌన్సిల్ సమావేశంలో ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల టెట్ పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు క్షేత్రస్థాయిలో అమలు చేయడం సాధ్యం కాదని అభిప్రాయం వ్యక్తం చేశారు. విద్యార్హతలకు సంబంధించి సాంకేతిక సమస్యలు తలెత్తుతాయన్నారు. టెట్పై సంఘం పక్షాన న్యాయ పోరాటం చేస్తామని వెల్లడించారు. ఉపాధ్యాయుల జి.పి.ఎఫ్, గ్రూప్ ఇన్సూరెన్స్, మెడికల్, సరెండర్ లీవ్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర ట్రెజరీ బిల్లులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇన్ని పెండింగ్ డిఏలు రాష్ట్ర చరిత్రలో ఎప్పుడు లేవన్నారు. పీఆర్సీ నివేదికను తెప్పించుకొని వెంటనే అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయులకు నిరంతరం పదోన్నతులు నిర్వహించేలా పాలసీని రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరారు. సర్వీస్ రూల్స్ రూపొందించి, అర్హులైన ఉపాధ్యాయులకు ఎంఈఓ, డిప్యూటీ ఈవో, డైట్, జూనియర్ లెక్చరర్ పదోన్నతులు కల్పించుటకు సంఘం కృషి చేస్తోందన్నారు. కేజీబీవీ, గిరిజన సంక్షేమ శాఖ సిఆర్టీలకు టైంస్కేల్ వర్తింపజేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, ఓపీఎస్ను అమలు చేయాలన్నారు. రాష్ట్ర నాయకులు గజేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి జె. లక్ష్మణ్, 19 మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా కౌన్సిలర్లు పాల్గొన్నారు. సంఘ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నికల అధికారి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, సంఘ రాష్ట్రఉపాధ్యక్షుడు రవీంద్ర పర్యవేక్షణలో ఎన్నుకొన్నారు.

# నిర్మల్లో దొడ్డి దారిన ఉద్యోగాల భర్తీ




### తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మన్ మహిపాల్

**నిర్మల్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లాలో దొడ్డి దారిన బ్యాక్ లాగ్ ఉద్యోగాలు భర్తీ చేస్తున్నారని తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మన్ మహిపాల్ యాదవ్ ఆరోపించారు. గురువారం నిర్మల్ ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ పాలన నుంచి వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ బ్యాక్ లాగ్ పోస్టులను గుట్టు చప్పుడు కాకుండా దొడ్డి దారిలో భర్తీలు జరుగుతున్నాయన్నారు. మా దృష్టికి వచ్చిందన్నారు. గతంలో కూడా నిర్మల్ మున్సిపల్ లో ఏకంగా 44 పోస్టులు భర్తీ చేయడం జరిగిందన్నారు. దీనికి ఎంక్వైరీ కమిటీ అధికారిక ఆర్డీవోను నియమించి, ఉద్యోగాలలో జరిగిన అవకతవకల గురించి పూర్తిస్థాయిలో నివేదిక ఇవ్వాలని చెప్పారు. కానీ ఇప్పటివరకు ఎటువంటి నివేదిక ఇవ్వలేదన్నారు. 44 ఉద్యోగాలను అంగట్లో వేలం వేసి అమ్ముకున్నారని మండిపడ్డారు. ఒక్కో పోస్ట్ కు లక్షల్లో వసూలు చేసినట్టు సమాచారం ఉందన్నారు. 2018 సంవత్సరంలో జేన్కోలో ఎటువంటి నోటిఫికేషన్ లేకుండా కాంటాక్ట్ ఒప్పందంపై ఉద్యోగాలను భర్తీ చేసి, 2022లో పర్మినెంట్ చేశారన్నారు. వీరి వద్ద నుంచి ఒక్కో పోస్టుకు రూ .30 లక్షల దాకా డిమాండ్ చేసినట్టు ఆరోపించారు ఇప్పటికైనా ప్రభుత్వం దొడ్డిదారిన జరిగే బ్యాక్ లాగ్ నియామకలను అడ్డుకొని ,నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇందులో విద్యార్థి నాయకులు కాశి, రాహుల్, సిద్దార్థ, తదితరులు ఉన్నారు.

# ఓ వైపు వర్షం.. మరో వైపు పులి

## కాసిపేట, బెల్లంపల్లి, తిర్యాణి అడవుల్లో పులి సంచారం - అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక

**కాసిపేట, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం, బెల్లంపల్లితో పాటు కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలాల మధ్య అడవుల్లో పెద్ద పులి సంచారం కలకలం సృష్టిస్తోంది. ఇటీవల కాలంలో కేవలం దేవాపూర్, ధర్మారావుపేట అటవీ పరిధిలోనే మూడు ఆవులు, దూడలపై పులి దాడులు చేసింది. కాసిపేట మండలంలోని ధర్మారావుపేట, దేవాపూర్, ఆరెడపల్లి, వెంకటాపూర్, లక్ష్మీపూర్, ఆరెడపల్లి, బెల్లంపల్లి అటవీ శివారుతో పాటు ఆసిఫాబాద్ జిల్లాలోని తిర్యాణి, రెబ్బెన మధ్య పెద్దపులి సంచరిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. శివారు గ్రామాల రైతులు పంట పొలాల్లోకి వెళ్లేటప్పుడు గుంపులుగా వెళ్లాలని, పశువుల కాపరులు అడవిలోకి వెళ్లకుండా బయట మేపుకోవాలని, అప్రమత్తంగా ఉండాలని కోరారు. పెద్దపులి సమాచారం తెలిస్తే వెంటనే ఫారెస్ట్



అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. సమీప గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని, పశువులపై పులి దాడులు చేస్తే బాధిత రైతుకు నష్టపరిహారం అందిస్తున్నామని తెలిపారు. వన్య ప్రాణాలుకు హాని తలపెట్టవద్దని, ఉచ్చులు, ఇతర మందులు పెట్టవద్దని సూచించారు. ఎవరైనా ఇటువంటి చర్యలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జోరు వర్షంలోనూ పులి కదలికలపై ధర్మారా వుపేట ఎఫ్ఎస్వో సత్యనారాయణ, ఎస్టీవో యుగేంధర్, ఎఫ్బీవో భాస్కర్, ఎనిమల్ ట్రాకర్ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.





### ఆర్పిఐ(ఎ) రాష్ట్ర ప్రధాన

## కార్యదర్శిగా తిరుపతి

**మందమర్రి, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**

మండలంలోని క్యాతనపల్లి మున్సిపాలిటీకి చెందిన తిరుపతిని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఆర్పీఐ(ఎ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు రవికుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. పట్టణ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతనంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన తిరుపతిని జిల్లా అధ్యక్షులు ఎండి రహమత్ ఖాన్ ఆధ్వర్యంలో జిల్లా నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి మాట్లాడుతూ... తనపై నమ్మకంతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ ప్రజా సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించే కృషి చేస్తానన్నారు.

## ఇళ్లలోకి చేరిన వర్షం నీరు


**జైనూర్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**

జైనుర్ మండలంలో గురువారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురిసింది. జంగాం గ్రామంలో సడక్ గూడలోని ఐదవ వార్డులో ఇండ్లలోకి వర్షం నీరు చేరింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో జన జీవనం స్తంభించింది. వర్షం నీటితో పాటు మురుగు కాలువలోని నీరు ఇండ్లలోకి చేరుతుందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ఏజెన్సీలో పరుచుకున్న మంచు దుప్పటి

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**

గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి ఆదిలాబాద్ జిల్లా ఏజెన్సీ ఘాట్‌లో హిమవర్షం కురుస్తోంది. దట్టమైన మేఘాలతో ఘాట్ రోడ్డులో ప్రయాణించే వాహనాదారులకు ప్రకృతి రమణీయత కనువిందు చేస్తుంది. కానీ, ఎదురుగా ఉన్న వారు కనబడనంతగా మంచు కురుస్తోంది. మరో వైపు ప్రయాణికులకు ప్రమాదమూ పొంచి ఉంది. దీంతో వాహనాదారులు తప్పని సరిగా హెడ్‌లైట్లు వేసుకొని ప్రయాణిస్తున్నారు. వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.



# సమాచారం సమగ్రంగా ఉండాలి



### అదనపు కలెక్టర్ దీపక్ తివారి

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**

విద్యా శాఖలో మండల స్థాయి అధికారులు పాఠశాల, ఉపాధ్యాయులు, విద్యార్థుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు నవీకరించాలని జిల్లా అదనపు కలెక్టర్, ఇంచార్జ్ జిల్లా విద్యాశాఖ అధికారి దీపక్ తివారి తెలిపారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన విద్యా విభాగం సమగ్ర సమీక్ష వర్క్ షాప్‌లో మండల విద్యాధికారులు, గిరిజన అభివృద్ధి అధికారులు, స్కూల్ కాంప్లెక్స్ రీసోర్స్ పర్సన్, సిబ్బందికి శిక్షణ అందించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్, ఇంచార్జ్ జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ... పాఠశాల వారీగా మౌలిక వసతులపై తనిఖీలు నిర్వహించి నివేదికలు సిద్ధం చేసి మండల విద్యాధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారుల ద్వారా ధ్రువీకరించి, సిఆర్పిలు సేకరించిన క్షేత్రస్థాయి సమాచారాన్ని ఎక్సెల్ ఫార్మాట్ లో సమర్పించాలని తెలిపారు. విద్యార్థుల ప్రొఫైల్, పూర్తి స్థితి, ఉపాధ్యాయుల ప్రొఫైల్, యుడైస్‌లో ప్రధానోపాధ్యాయుల వివరాలు, పర్యవేక్షణ, తక్షణ సవరణలు, విద్యార్థుల ఆధార్ అప్‌డేట్ స్థితి, ఆధార్ లేని విద్యార్థుల వివరాల ద్వారా ధృవీకరణ ప్రక్రియ పూర్తి చేయడం, ఎంబియు, ఆధార్ ధృవీకృత విద్యార్థులకు అపార్ సంఖ్యల సృష్టి, పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల రిలీస్ రిక్వెస్టుల క్లియరెన్స్, డ్రాప్‌బాక్స్‌లో అప్‌లోడ్ చేయబడిన విద్యార్థుల నివేదికల సమీక్ష, పాఠశాల ఫెసిలిటీ అండ్ మెయింటెనెన్స్ గ్రాంట్ల ఖాతా వివరాల ధృవీకరణ, డిజిటల్ పరికరాల ప్రస్తుత స్థితి పర్యవేక్షణ ప్రతి అంశాన్ని ఎప్పటికప్పుడు నవీకరించాలని తెలిపారు. పాఠశాల సమాచారం పారదర్శకంగా, సమగ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.



### ప్రాణాంతక వ్యాధుల నుంచి

## రక్షణకే టీకాలు

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**

ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షించుకునేందుకు హెపటైటిస్ టీకాలను ప్రతి ఒక్కరూ తీసుకోవాల్సిన అవసరం ఉందని రిమ్స్ ససంచాలకుడు రాథోడ్ జైసింగ్ పేర్కొన్నారు. రిమ్స్‌లోని వైద్యులు, వైద్య విద్యార్థులు, ఇతర సిబ్బందికి గురువారం రిమ్స్ ఆడిటోరియంలో నోడల్ అధికారి డాక్టర్ శ్రీకాంత్, డీఐఓ వైసీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో హెపటైటిస్ టీకాల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ టీకా వల్ల కాలేయ సంబంధిత వ్యాధులు, క్యాన్సర్ నుంచి రక్షణ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్లు దీపక్ పుష్కర్, నరేందర్ బండారి, క్షయ నివారణ అధికారిని సుమలత, డాక్టర్ తిప్పే స్వామి తదితరులు పాల్గొన్నారు.

### గ్రూప్-1లో సత్తా చాటిన

## రాథోడ్ ప్రమోద్

**ఇంద్రవెల్లి, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**



గ్రూప్-1 మెయిన్స్ ఫలితాల్లో ఇంద్రవెల్లి మండలంలోని వాగాయితాంద గ్రామానికి చెందిన రాథోడ్ ప్రమోద్ 458.5 మార్కులతో 420వ ర్యాంక్ సాధించి డిఎస్పీ ఉద్యోగం దక్కించారు. ఇంద్రవెల్లి మండలంలోని వాగాయింతాండ గ్రామానికి చెందిన సత్యాభామ, రాథోడ్ దుదిరాం దంపతుల కుమారుడైన రాథోడ్ ప్రమోద్ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో 1వ నుండి ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. 2007-10 విద్యా సంవత్సరంలో ఢిల్లీలోని వెంకటేశ్వర్ యూనివర్సిటీలో డిగ్రీలో బిఏ పూర్తి చేశాడు. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఏ పూర్తి చేసి అక్కడే ప్రస్తుతం పిహెచ్‌ఏ మూడో సంవత్సరం చదువుతూ గ్రూప్స్‌కు సిద్దమయ్యారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్-1 పరిక్ష రాసి మొదటి ప్రయాత్నంలోనే సత్తాచాటి డిఎస్పీగా ఉద్యోగం సాధించారు. దీంతో గ్రామస్తులు, మండల వాసులు రాథోడ్ ప్రమోద్ను అభినందించారు. కాగ రాథోడ్ ప్రమోద్ ఐదు సార్లు యూపిఎస్సీ సివిల్స్ రాసి ఇంటర్వ్యూ వరకు వెళ్లి పరజాయం అయినట్లు తెలిపారు.

# సిమెంట్ కంపెనీ కార్మికులకు బోనస్

### యాజమాన్యంతో చర్చలు సఫలం - రెండేళ్ల ఒప్పందానికి అంగీకారం

**కాసిపేట, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ కార్మికులకు బోనస్ విషయంలో గుర్తింపు సంఘం, దేవాపూర్ సిమెంట్ కంపెనీ యాజమాన్యంతో జరిగిన చర్చలు సఫలమయ్యాయి. కంపెనీ యాజమాన్యం, గుర్తింపు సంఘం యూనియన్ అధ్యక్షులు కొక్కిరాల సత్యపాల్ రావు ఆధ్వర్యంలో జరిగిన చర్చల్లో ఈ ఏడాది పర్మినెంట్, లోడింగ్ కార్మికులకు గతంలో ఉన్న రూ.35,500కు ఈ ఏడాది మొదటి ఏడాది రూ.4000 కలిపి రూ.39,500, వచ్చే ఏడాది మరో రూ. 2000 కలిపి రూ.41,500 ఇవ్వడానికి యాజమాన్యం అంగీకరించింది. ఇది రెండేళ్ల పాటు కొనసాగుతుందని వివరించారు. కాంట్రాక్ట్ కార్మికులకు గత ఏడాది రూ.16,800 ఇవ్వగా రూ.1000 పెంచి రూ.17,800 చెల్లించేందుకు అంగీకారం కుదిరిందని కొక్కిరాల సత్యపాల్ రావు వెల్లడించఆరు. త్వరంలోనే కార్మికుల ఎకౌంట్లో బోనస్ జమ కానుందని తెలిపారు. గతం కంటే పోలిస్తే ఈ ఏడాది మెరుగైన బోనస్ సాధించినట్లు యూనియన్ నాయకులు తెలిపారు. ఈ చర్చల్లో కంపెనీ హెచ్ఆర్ హెడ్ కులకర్ణి, యూనియన్ జనరల్ సెక్రెటరీ భీమిని మహేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ మేరుగు శంకర్, కాల్వ సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ రైతాంగ ఉద్యమానికి చిహ్నం

# చాకలి ఐలమ్మ



నేడు వీరనారి చిట్యాల ఐలమ్మ జయంతి

భూమి కోసం, భుక్తి కోసం, బతుకుబండి సాగించేందుకు అణగారిన జాతి గళం వినిపించింది ఐలమ్మ. నిజాం బానిస సంకెళ్లను భూస్వాముల అణచివేతకు వ్యతిరేకంగా పోరాట స్ఫూర్తిని రగిలించింది. కొమరయ్య వీరుడి పథంలో వెలుగుల జ్వాలగా నిలిచి, సమాన హక్కుల జెండా ఎగరేసిన తెలంగాణ సాయిధ పోరాటం వైపు అడుగులు వేసింది. ఇంటి అంచునుంచే మొదలైన ఆమె అడుగులు భూక్షేత్రాలపై పడగా అణగారిన వర్గ ప్రజల ఊపిరిగా మారింది. ఆమె పోరాటం తెలంగాణ గడ్డపై విజయ గీతంగా మార్మోగింది. చాకలి ఐలమ్మ నినాదం నేటికీ మన రక్తంలో ప్రవహిస్తోంది. అన్యాయానికి ఎదురు నిలిచే ప్రతి గుండెలో గర్జనలాగ మోగుతోంది. చిట్యాల ఐలమ్మ, వరంగల్ జిల్లా, రాయపర్తి మండలం క్రిష్టాపురం గ్రామంలో 1895 సెప్టెంబరు 26న ఓరుగంటి మల్లమ్మ, సాయిలుకు నాలుగో సంతానంగా ఐలమ్మ జన్మించింది. వీరిది వెనుకబడిన కుటుంబం. చాకలి కులవృత్తే వారికి జీవనాధారం. పాలకుర్తికి చెందిన చిట్యాల నర్సయ్యతో ఐలమ్మ బాల్య వివాహం జరిగింది. వీరికి ఐదుగురు కుమారులు సోమయ్య, లచ్చయ్య, ముత్తి లింగయ్య, లక్ష్మీ నర్సయ్య, ఉప్పలయ్య, కుమార్తె సోమ నర్సమ్మ. 1940-44 మధ్య కాలంలో విస్నూర్ లో దేశ్‌ముఖ్ , రజాకర్ల అరాచకాల పై ఎదురు తిరిగి ఎర్రజెండా పట్టింది ఐలమ్మ. ఐలమ్మ భూమి కోసం, భూమిలేని దళిత వర్గాల హక్కుల కోసం పోరాడారు. ఆమె తన కుటుంబంతో కలిసి, వ్యవసాయ భూముల ఆక్రమణకు వ్యతిరేకంగా పోరాడి, భూస్వాముల ఆధిపత్యానికి సవాలు విసిరారు.

అగ్రకులాల స్త్రీలు, దొరసానులు తమను కూడా 'దొరా' అని ఉత్పత్తి కులాల (బీసీ కులాల) చేత పిలుపించుకొనే సంస్కృతికి చరమగీతం పాడినవారిలో ఐలమ్మ ముందంజలో ఉన్నారు. దొరా అని పిలువకపోతే ఉన్నత కులాలతో పాటు వారి అనుంగు ఉంపుడుకత్తెలలో కూడా ఉన్న రాక్షస ప్రవృత్తి అనేక పీడన రూపాలలో బయటకు వచ్చేది. వెనుకబడిన కులాల మీద ఆ పీడన రూపాలు విరుచుకుపడేవి. తమను దొరా అని పిలువని ఉత్పత్తి కులాల స్త్రీల మీద తమ భర్తలను ఉసిగొల్పి, దగ్గరుండి అఘాయిత్యం చేయించేవారు. 'ఈ భూమినాది.. పండించిన పంటనాది.. తీసుకెళ్లడానికి దొరెవ్వడు.. నా ప్రాణం పోయాకే ఈ పంట, భూమి మీరు దక్కించుకోగలరు..' అంటూ మాటల్ని తూటాలుగా మల్చుకొని దొరల గుండెల్లో బడబాగ్నిలా రగిలిన తెలంగాణ రైతాంగ విప్లవాగ్ని చాకలి ఐలమ్మ.

**పోరాటంలోకి ప్రవేశం..**

1946-47 నాటికి తెలంగాణలో రైతాంగ పోరాటం తీవ్ర రూపం దాల్చింది. నిజాం ప్రభుత్వం లైంగికదాడులు, జమీందారుల దాష్టీకాలు ఇక తట్టుకోలేని స్థితికి చేరుకున్నాయి. కమ్యూనిస్ట్ నాయకుల నేతృత్వంలో రైతులు సాయుధ పోరాటం ప్రారంభించారు. ఈ పరిస్థితులలో చాకలి ఐలమ్మ కూడా పోరాటంలో భాగస్వామి అయ్యారు. ఆమె గ్రామంలోని మహిళలను ఐక్యత చేయడం, పోరాట యోధులకు ఆహారం సరఫరా చేయడం, సమాచారం అందించడం వంటి కార్యకలాపాలలో చురుగ్గా పాల్గొన్నారు. ఆమె ఇల్లు పోరాట యోధులకు ఒక సురక్షితమైన ఆశ్రయంగా మారింది. ఐలమ్మ కుటుంబం కమ్యూనిస్టుల్లో చేరిందని విస్నూర్ దేశ్‌ముఖ్ రాపాక రాంచంద్రారెడ్డికి ఫిర్యాదు చేశాడు. కేసులో అగ్ర నాయకులతో పాటు ఐలమ్మ కుటుంబాన్ని కూడా శారీరకంగా, ఆర్థిక ఇబ్బందులకు గురిచేశారు. ఐలమ్మ కుటుంబాన్ని ఆర్థికంగా దెబ్బతీస్తే సంఘం పట్టు కోల్పోతుందని భావించిన దేశ్‌ముఖ్,పోలీస్ పటేల్ ను పిలిపించుకొని, ఐలమ్మ కౌలుకు తీసుకున్న ఉత్తమరాజు జయప్రదా దేవి భూమిని తన పేరున రాయించుకున్నాడు. భూమి తనదని, పండించిన ధాన్యం తనదేనని పంటను కోసుకురమ్మని వంద మందిని దేశ్‌ముఖ్ పంపాడు. ఆంధ్ర మహాసభ కార్యకర్తలు వరిని కోసి, వరికట్టం

### నేటి మహిళలకు, ఉద్యమకారులకు ఎంతో స్ఫూర్తిదాయకం..

పాలకుర్తిలో ఐలమ్మ స్మారక స్థూపం, స్మారక భవనాన్ని సీపీఎం పార్టీ వారు ప్రజల విరాళాలతో నిర్మాణం చేశారు. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో 2015 సెప్టెంబరు 10న పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో ఐలమ్మ కాంస్య విగ్రహాన్ని సీపీఎం పోలిట్ బ్యూరో సభ్యురాలు బృందకారత్ ఆవిష్కరించారు. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం, 2022 ఏప్రిల్ లో తెలంగాణ రాష్ట్రప్రభుత్వం హైదరాబాద్ లోని కోఠి మహిళా కళాశాలను తెలంగాణ తొలి మహిళా విశ్వవిద్యాలయంగా ప్రకటించింది. ఆ తర్వాత 2024లో అది వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంగా అవతరించింది. కాగా, దీనికి మార్చి 2025లో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) గుర్తింపు లభించడం పోరాట స్ఫూర్తి కలిగిన మహిళకి ఇచ్చిన గౌరవంగా భావించవచ్చు. చాకలి ఐలమ్మ భూపోరాటం కేవలం రైతాంగ పోరాట చరిత్రలోని ఒక అధ్యాయం మాత్రమే కాదు, ఆమే ఆశయం స్త్రీ శక్తి, సమానత్వం, న్యాయం కోసం జరిగే శాశ్వత పోరాటానికి ఒక ప్రతీక. అందుకే ఆమె పేరు తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలో స్వర్ణాక్షరాలతో లిఖించబడింది చాకలి ఐలమ్మ వంటి అసంఖ్యాకమైన అనామక వీరుల త్యాగాలను మరవకూడదు. స్వాతంత్ర్యం, స్వాభిమానం కోసం పోరాడిన ఆ వీరుల స్మృతిని ఎల్లప్పుడూ గౌరవించడమే, వారి త్యాగాలకు చేయగల నిజమైన కృతజ్ఞత. భూమి కోసం, భుక్తి కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం నేటి మహిళలకు, ఉద్యమకారులకు ఎంతో స్ఫూర్తినిస్తుంది.




కొట్టి ధాన్యాన్ని ఐలమ్మ ఇంటికి చేర్చారు. భీంరెడ్డి నరసింహారెడ్డి, ఆరుట్ల రాంచంద్రారెడ్డి, చకిలం యాదగిరి సైతం ధాన్యపు బస్తాలను భుజాలపై మోసారు. కొండా లక్ష్మణ్ బాపూజీ సహకారంతో ఐలమ్మకు అనుకూలంగా తీర్పు వచ్చింది. రజాకార్ల ఉపసేనాధిపతి అయిన దేశ్‌ముఖ్ రెండుసార్లు పరాజయం పాలయ్యాడు. ఐలమ్మ ఇంటిని కూడా తగులబెట్టారు. ధనాన్ని, ధాన్యాన్ని ఎత్తుకెళ్లారు. ఐలమ్మ కూతురు సోమ నర్సమ్మపై లైంగికదాడికి పాల్పడ్డారు. ఐలమ్మ కుమారులు ముగ్గురు, పాలకుర్తి కమ్యునిష్టు నాయకత్వం ఇంటిని కూల్చి అదే స్థలంలో మొక్కజొన్న పంటను పండించారు. అనేక రకాలుగా నష్టపోయినప్పటికీ ఐలమ్మ కుటుంబం ఎర్రజెండాను వీడలేదు. ఐలమ్మ భూపోరాటం విజయంతో పాలకుర్తి దొర ఇంటిపై కమ్యూనిస్టులు దాడిచేసి ధాన్యాన్ని ప్రజలకు పంచారు. అలాగే 90 ఎకరాల దొర భూమిని కూడా ప్రజలకు పంచారు. ఐలమ్మ భూపోరాటంతో మొదలుకొని సాయుధ పోరాటం చివరి వరకు నాలుగు వేలమంది ఉత్పత్తి కులాల వారు అమరులయ్యారు. 10 లక్షల ఎకరాల భూమి పంపకం జరిగింది. ప్రజా పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచిన ఐలమ్మ 1985 సెప్టెంబర్ 10న అనారోగ్యంతో మరణించింది. చాకలి ఐలమ్మ మరణం తెలంగాణ పోరాట చరిత్రలో ఒక ముఖ్యమైన మలుపు. ఒక సామాన్య రైతు కుటుంబానికి చెందిన మధ్య వయసు మహిళ, తన ప్రాణాలను తృణప్రాయంగా త్యాగం చేయడం, ఆ సమయంలో ప్రజలలో గొప్ప ఆవేశాన్ని, రోషాన్ని రగిలించింది. ఆమె మరణం తెలంగాణ పోరాటాన్ని మరింత వేగవంతం చేసింది. ఇది పోరాటం కేవలం యువకులది మాత్రమే కాదు, సామాన్య ప్రజలందరి పోరాటం అని చాటింది.



# ఊబకాయంతో యమా డేంజర్

## భవిష్యత్ ప్రమాద ఘంటికలు

(ప్రభాత సమాచారం, హెల్త్ డెస్క్)

ఊబకాయం : ప్రస్తుతం అతిపెద్ద సమస్యగా మారింది. ప్రపంచ వ్యాప్తంగా ఊబకాయుల సంఖ్య పెరుగుతోంది. దీంతో చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. అయితే ఇందుకు వైద్యులు ఆనేక కారణాలు చెబుతున్నారు. భారత దేశంలో 2050 నాటికి భారతదేశంలో అధిక బరువుగల వారి సంఖ్య ఏకంగా 45 కోట్లకు చేరే అవకాశం ఉంది. ఈ సమస్య 15%-%24 ఏళ్ల యువతలోనూ, 5%-%14 ఏళ్ల పిల్లల్లోనూ వేగంగా పెరుగుతోంది. ప్రస్తుతం చైనా, అమెరికా తర్వాత భారత్ ఊబకాయ సమస్యలో మూడో స్థానంలో ఉంది. 2021 గణాంకాల ప్రకారం దేశంలో 17.6 కోట్ల మంది అధిక బరువుతో ఉన్నారు. రాబోయే కొన్నేళ్లలో అమెరికాను అధిగమించి, ప్రపంచంలో ఊబకాయుల సంఖ్యలో భారత్ రెండో స్థానంలో నిలిచే అవకాశం ఉందని లాన్సెట్ జర్నల్ తెలిపింది.

**తెలుగు రాష్ట్రాల్లోలనూ..**

తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ సమస్య వేగంగా విస్తరిస్తోంది. హైదరాబాద్ (Hyderabad)లోని ఐటీ ఉద్యోగుల్లో ఎక్కువ మంది స్థూలకాయంతో బాధపడుతున్నట్లు సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఈ పరిస్థితి మన దగ్గర ప్రమాద సంకేతాలు మోగిస్తోందని అర్థం చేసుకోవాలి. జీవన శైలి, వ్యాయామం లేకపోవడం, వేళాపాల లేకుండా తినడం వంటి కారణాలు ఊబకాయానికి కారణం అంటున్నారు.

**ఆహారంలో జాగ్రత్తలు - మైండ్‌ఫుల్ ఈటింగ్ కీలకం**

నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఊబకాయానికి ప్రధాన పరిష్కారం 'మైండ్‌ఫుల్ ఈటింగ్'. దీని కోసం కొన్ని సూత్రాలు పాటించాలి. ఆకలి వేసినప్పుడు మాత్రమే తినాలి. సమయం అయిందని అనవసరంగా ఆహారం తీసుకోవడం బరువు పెరగడానికి దారితీస్తుంది. ఒంటరితనం, బాధ లేదా కాలక్షేపం కోసం అతిగా తినడం మానాలి. భోజన సమయంలో టీవీ, మొబైల్ వంటి పరధ్యానాలు లేకుండా, ఏం తింటున్నామో, ఎంత తింటున్నామో శ్రద్ధగా గమనించాలి. ఆహారం రుచిని ఆస్వాదిస్తూ నెమ్మదిగా తినాలి. క్యాలరీలపై అవగాహన ఉంచాలి. ఒక పూట ఎక్కువ తీసుకుంటే, తర్వాతి పూట తగ్గించాలి. సమతుల ఆహారం, క్రమం తప్పని వ్యాయామం, శారీరక శ్రమ, ఆరోగ్యకరమైన జీవనశైలి, తగిన నిద్ర, ఒత్తిడి నియంత్రణ వంటివి ఊబకాయాన్ని అరికట్టడంలో సహాయపడతాయి.

**యువత, పిల్లల్లో ఊబకాయం..**

'వరల్డ్ ఒబేసిటీ ఫెడరేషన్' ప్రకారం, ప్రాసెస్డ్ మరియు ప్యాక్ చేసిన ఆహారాలు యువత, పిల్లల్లో ఊబకాయానికి ప్రధాన కారణం. అదనంగా, మొబైల్ ఫోన్లు, టీవీలకు అతిగా అలవాటు పడడం, ఆటస్థలాల్లో శారీరక ఆటలు తగ్గిపోవడం కూడా ఈ సమస్యను తీవ్రతరం చేస్తున్నాయి.

### ఊబకాయం అంటే ఏమిటి?

శరీరంలో కొవ్వు అధికంగా పేరుకుపోతే దాన్ని ఊబకాయం అంటారు. దీన్ని బాడీ మాస్ ఇండెక్స్ ద్వారా కొలుస్తారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల ప్రకారం..

- 18.5 కన్నా తక్కువ: తక్కువ బరువు
- 18.5-24.9: సాధారణ బరువు
- 25-29.9: అధిక బరువు
- 30 కన్నా ఎక్కువ: ఊబకాయం

### ఊబకాయానికి కారణాలు

- జన్యుపరమైన అంశాలు
- అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు
- శారీరక శ్రమ లేకపోవడం
- వాతావరణ కారణాలు
- కొన్ని ఔషధాల వాడకం

ఊబకాయం వల్ల వచ్చే అనారోగ్య సమస్యలు

అధిక బరువు ఉన్నవారికి ఇతర ఆరోగ్య సమస్యలు కూడా తలెత్తే ప్రమాదం ఉంది :

- టైప్-2 మధుమేహం
- అధిక రక్తపోటు
- గుండె జబ్బులు - ఫ్యాటీ లివర్
- మానసిక ఆరోగ్య సమస్యలు
- మహిళల్లో గర్భధారణ సమస్యలు



- ఉమ్మడి జిల్లాలో మూడో రోజూ వర్ష బీభత్సం..
- వందలాది ఎకరాల్లో నీట మునిగిన పంట చేలు
- లో లెవల్ వంతెనపై పారుతున్న వరద నీరు..
- ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులు.. వంకలు..
- కోతకు గురైన వంతెనలు, ప్రధాన రహదారులు..
- అనేక గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు
- కడెం ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల..
- ఉగ్రరూపం దాల్చిన ప్రాణహిత, పెన్‌గంగ నదులు
- వరదతో మహారాష్ట్రకు నిలిచిపోయిన రాకపోకలు
- ఇళ్లలోకి చేరిన వరదనీరు
- ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలో దంచికొట్టి వాన..
- పిడుగు పాటుకు మాడిపోయిన పత్తి పంట
- స్తంభించిన జనవ జీవనం

**ఆదిలాబాద్/ నిర్మల్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)** ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలో గురువారం ఎడతెరపి లేని వర్షం కురిసింది. ఆదిలాబాద్ జిల్లాలో గురువారం తెల్లవారుజామున నుచి ఏకధాటిగా వర్షం కురిసింది. జిల్లాలోని ఇచ్చోడలో 14 సెం.మీ.లు, ఉట్నూర్‌లో 11.3, బేల మండలం చెప్రాలలో 10 సెం.మీ.ల వర్షపాతం నమోదు అయ్యింది. ఇచ్చోడ మండలం ముఖరా (బి) గ్రామ శివారులో పత్తి చేనులో పిడుగు పడటంతో సుమారు 200 కు పైగా పత్తి మెక్కలు మాడిపోయాయి. మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలు, అక్కడి ప్రాజెక్టుల నుంచి విడుదల చేస్తున్న నీటితో నిర్మల్ జిల్లా బాసర వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్నది. నాందేడ్, ఔరంగాబాద్ జిల్లాల్లో భారీ స్థాయిలో వర్షాలు కురవడంతో గోదావరిలోకి సుమారు మూడు లక్షల క్యూసెక్కుల నీరు వస్తుంది. బాసర వద్ద ఉగ్రరూపం దాల్చడంతో పుష్కర ఘాట్ల వద్దకు రాకపోకలు నిషేధించారు. శ్రీరామ్ సాగర్ బ్యాక్ వాటర్ బాస రను చేరుకోవడంతో బాసర మండలంలోని ఓని కౌటసాలాపూర్ ఇతర గ్రామాలు 15 రోజులుగా పంటలు మునిగిపోవడంతో రైతు లు ఆందోళన చేస్తున్నారు. ఇదిలా ఉండ గా జిల్లావ్యాప్తంగా గురువారం ఎడతెరపి లేకుండా వర్షాలు కురవడంతో నూతన ప్రాంతాలు జలమయమయ్యాయి. మహాదేవపూర్ మం డలంలో గత రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి, ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి ఉప్పొంగి ప్రవహిస్తున్నది. మేడిగడ్డ (లక్ష్మి) బ్యారేజ్ వద్ద 7,40,400 క్యూసెక్కుల నీటి ప్రవాహం రాగా మేడిగడ్డ బ్యారేజ్ 85 గేట్లను ఎత్తి అంతే

కాళేశ్వరం వద్ద మెట్లపై నుండి గోదావరి ప్రవహిస్తున్నందున భక్తులు మెట్ల వద్దనే స్నానాలు ఆచరించాలని లోపలికి వెళ్లరాదని అధికారులు సూచించారు. అన్నారం బ్యారేజ్ దిగివన మద్దుల పల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నందున రాకపోకలు నిలిచిపోయాయి. పత్తి, మిర్చి చేన్లు గోదావరి నీటితో నిండిపోయాయి.






# చినుకు వదలదు..
# వరద కదలదు

## ఊహించని రీతిలో
# సదర్‌మాట్‌కు వరద ఉధృతి

**నిండుకుండలా ఆనకట్ట - ప్రవాహానికి ఊడిపోయిన గేట్లు**



**ఖానాపూర్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)** నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం మేడిపల్లి గ్రామపంచాయతీలో సహజసిద్ధంగా గోదావరి నదిపై నిర్మించిన సదర్ మాట్ ఆనకట్ట వద్ద ప్రవాహం ఉదృతంగా కొనసాగుతుంది. దీంతో ఆనకట్ట వద్ద జల కళ సంతరించుకుంది. గత మూడు రోజులుగాపై ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు పైన ఉన్న ఎస్ఆర్ఎస్పీ ప్రాజెక్టు గేట్లు ఎత్తివేయడంతో ధారాళంగా సదర్ మాటుకు ప్రవాహం పెరిగిపోయింది. ఆనకట్ట మీదుగా పొంగి పొర్లుతుండడంతో నీరు గోదావరిలోకి వృధాగా పోతుంది. ప్రవాహ ఉధృతికి ఆనకట్ట వద్ద ఉన్న గేట్లు ఊడిపోవడంతో కాలువలోకి అధిక నీరు ప్రవహిస్తుంది. దీంతో కాలువ పరిసర ప్రాంతాల్లో ఉన్న వారికి అప్రమత్తంగా ఉండాలని గురువారం అధికారులు సూచించారు. పరిసర ప్రాంతాలకు వెళ్ళవద్దని స్థానిక పోలీసులు హెచ్చరిస్తున్నారు. సదర్‌మాట్ వద్దకు ఎవరూ వెళ్లకుండ రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు.

## నిండుకుండను తలపిస్తున్న సాత్నాల ప్రాజెక్టు

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)** ఆదిలాబాద్ జిల్లా సాత్నాల మండలంలోని సాత్నాల ప్రాజెక్టు నిండుకుండను తలపిస్తోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 286.50 మీటర్లు కాగా.. ప్రస్తుతం 286.20 మీటర్ల వరకు వరద నీరు చేరుకుంది. జలకళ సంతరించుకోవడంతో ప్రాజెక్టును చూసేందుకు పరిసర ప్రాంత ప్రజలు, పర్యాటకులు వస్తున్నారు.



# బాసర వద్ద గోదావరి ఉగ్రరూపం



**ముథోల్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)** నిర్మల్ జిల్లాలోని బాసర వద్ద గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. జిల్లాలో కురుస్తున్న వర్షాలకు తోడు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న భారీ వరద నీటితో గోదావరి నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. భారీగా వస్తున్న వరద కారణంగా గోదావరి పుష్కర ఘాట్లు పూర్తిగా నీట మునిగాయి. ఆలయ సమీపంలోని పలు హోటల్లు, లాడ్జీల చుట్టూ వరద నీరు చేరింది. బాసర ఆలయం నుంచి గోదావరి నదికి వెళ్లే దారి పూర్తిగా నీట మునిగింది. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.



# గిరిజనుల సమగ్రాభివృద్ధే లక్ష్యం కృషి చేయాలి

## కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్సులో కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ కార్యదర్శి విహునాయర్



**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆదికర్మ యోగి పథకం ద్వారా గిరిజనుల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా కృషి చేయాలని కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ కార్యదర్శి విహునాయర్ అన్నారు. న్యూఢిల్లీలోని కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ కార్యాలయం నుంచి గురువారం ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలంగాణలోని జిల్లాల కలెక్టర్‌లు, అదనపు కలెక్టర్‌లు, గిరిజన సంక్షేమాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. గిరిజన ప్రాంతాలలో రహదారులు, పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, అంగన్‌వాడీ కేంద్రాలలో వసతులు, ప్రతీ గ్రామానికి విద్యుత్ సౌకర్యం, ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణాల కోసం కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. గిరిజన గ్రామాలలో ఆది సేవా కేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సముదాయంలోని వీసీ హాల్ నుంచి అదనపు కలెక్టర్ దీపక్ తివారి హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఆది కర్మయోగి పథకం అమలులో భాగంగా జిల్లాలోని 12 మండలాలో గల 102 గిరిజన గ్రామాలల్లో బ్లాక్ స్థాయి మాస్టర్ ట్రైనర్లు, విద్యాశాఖాధికారులతో గ్రామ స్థాయిలో శిక్షణ పూర్తి చేశామని తెలిపారు. విద్య, వైద్యం, గిరిజన సంక్షేమం, తాగు నీరు, విద్యుత్, వ్యవసాయ రంగాల అభివృద్ధి, రహదారుల నిర్మాణాలపై ప్రత్యేక కార్యాచరణ రూపొందంచి గిరిజన గ్రామాలలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గిరిజన గ్రామాల అభివృద్ధిలో భాగంగా 2030 సంవత్సరం వరకు కార్యాచరణ రూపొందిస్తున్నామని, గిరిజన ప్రాంతాలలో రహదారులు, పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, వైద్య శాఖాధికారులు, తదితరులు పాల్గొన్నారు.



### ఫిర్యాదుదారులతో

## మర్యాదగా ప్రవర్తించాలి

### సీపీ అంబర్ కిషోర్ ఝా

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**

పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా అన్నారు. గురువారం వార్షిక తనిఖీలో భాగంగా బెల్లంపల్లి టూ టౌన్ పోలీస్ స్టేషన్ ను ఆయన తనిఖీ చేశారు. టూటౌన్ పరిధిలో జరుగుతున్న నేరాలు, తీసుకుంటున్న చర్యలపై అడిగి తెలుసుకున్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. నీర నియంత్రణపై ప్రత్యేకమైన దృష్టి సారించాలని ఆదేశించారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో పరిసరాలను పరిశీలించి ఎస్సై కిరణ్ కుమార్‌ను అభినందించారు.

## వాగులు దాటే సాహసం చేయవద్దు



**బెజ్జూర్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**

వాగులు, ఒర్రెలు, ఉప్పొంగిన సమయంలో ఎవరు కూడా దాటే ప్రయత్నాలు చేయకూడదని తహసిల్దార్ రామ్మోహన్, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. బెజ్జూర్ మండలంలోని సుస్మీర్ ఒర్రెను అధికారులతో కలిసి పరిశీలించారు. మరో రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. వాగులు ఒర్రెలు ఉప్పొంగిన సమయంలో గిరిజన గ్రామాల ప్రజలు ఎవరు కూడా దాటే ప్రయత్నాలు చేయకూడదని గ్రామాల ప్రజలకు సూచించారు. ఉరుముల మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసిన సమయంలో చెట్ల కింద కానీ,ఎత్తైన ప్రదేశాల్లో ఉండకూడదని పిడుగులు పడే అవకాశం ఉందని తెలిపారు.అత్యవసర పరిస్థితుల్లో మండల అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. వారి వెంట గ్రామ కార్యదర్శి రోజా, కరోబార్ సుధాకర్ తదితరులు ఉన్నారు.

### సీటీవో ఉద్యోగానికి

## ఎంపికైన చిన్న బూద వాసి

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం చిన్న బూద (రవీంద్రనగర్)కు చెందిన కొత్తూరు సత్యనారాయణ మూర్తి గ్రూపు-1 ఫలితాల్లో కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ (సిటిఓ) ఉద్యోగానికి ఎంపికయ్యారు. రవీంద్ర నగర్ కు చెందిన కొత్తూరు శ్రీనివాస్ కుమారుడు సత్యనారా యణ మూర్తి పదో తరగతి వరకు బెల్లంపల్లి సెయింట్ మేరీస్, ఇంటర్ ప్రగతి కళాశాల, డిగ్రీ హైదరాబాదులోని ఏవీ కళాశాలలో పూర్తి చేశారు. డిగ్రీ పూర్తయిన తర్వాత గ్రూప్స్ కు ప్రిపరేషన్ కొనసాగిస్తూ ఇటీవల గ్రూపు వన్ పరీక్షల్లో 280 ర్యాంక్ సాధించి కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ ఉద్యోగానికి అర్హత సాధించారు.

## ఏఎన్ఎంలపై అధికారుల వేధింపులు ఆపాలి

**మంచిర్యాల, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**

ఏఎన్ఎంలపై అధికారుల వేధింపులు ఆపాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఏఎన్ఎంలపై అధిక పని భారం మోపుతుందని, గత ఏడాది రెండవ ఏఎన్ఎంలకు పరీక్ష పెట్టినా నేటికి ఫలితాలు ఇవ్వకుండా , రెగ్యులరైజేషన్ చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. రెగ్యులర్ ఏఎన్ఎంలకు ఎఫ్.టి.ఏ, 18 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకున్నా స్పెషల్ ఇంక్రిమెంట్ కొన్ని సంవత్సరాలుగా పెండింగ్ లో పెట్టిందన్నారు. రెగ్యులర్ ఏఎన్ఎంలకు 28 ఏళ్లు గడిచిన ప్రమోషన్లు ఇవ్వకుండా కాలయాపన చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్నేండ్లుగా వ్యాక్సిన్ కారియర్ డబ్బులు కూడా అధికారులు చెల్లించడం లేదని, ఇప్పటికైనా సెకండ్ ఏఎన్ఎంలు పరీక్ష ఫలితాలు ప్రకటించి వెంటనే పోస్టింగులు ఇవ్వాలని, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్.సి.డి ఆన్ లైన్ చేయాలంటూ ఏఎన్ఎంల పైన అధికారుల వేధింపులు ఆపాలని, లేకుంటే డిఎంహెచ్ఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మౌలాలి పద్మ, మంజుల, ధనలక్ష్మి, సంధ్యారాణి, పుష్ప, మమతా, రాణి, భాగ్యలక్ష్మి, హరిత, విజయలక్ష్మి, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల అభివృద్ధికి ప్రాధాన్యం

### గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకురాలు రమాదేవి - రౌటసంకెపల్లి గ్రామంలో గిరిజనులతో ముఖాముఖి



**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**

గిరిజనుల అభివృద్ధికి ప్రాధాన్యమి స్తున్నామని గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకురాలు రమాదేవి అన్నారు. గిరిజనుల సమగ్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి జన జాతీయ గ్రామీణ ఉత్కర్ష్ అభియాన్ పథకం ద్వారా గిరిజనులకు అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు గిరిజనులకు అందుతున్నాయా లేదా అనే విషయాన్ని గురువారం కేంద్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి బృందం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం రౌటసంకెపల్లి గ్రామంలో పరిశీలించారు. గిరిజనులతో ముఖాముఖి చర్చలు జరిపారు. ఈ సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకురాలు రమాదేవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గిరిజన ప్రజల అభివృద్ధికి అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జిల్లాలో 102 గిరిజన గ్రామాల్లో అభివృద్ధి కోసం ఈ పథకం ప్రారంభించామన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి మాట్లాడుతూ ఈ పథకం ద్వారా గిరిజనులకు ఆధార్, అయుష్మాన్‌భారత్ అన్ని రకాల మౌలిక సదుపాయాలు, నిరుద్యోగ గిరిజన విద్యార్థులకు శిక్షణ ఇప్పించి ఉపాధి చూపనున్నామని అన్నారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం గిరిజన ప్రజలకు వారికి దగ్గర్లోనే ఆధార్ క్యాంపును పెట్టి గిరిజన ప్రజలకు పీఎం జుగా కార్యక్రమంలో భాగంగా ఆధార్ కార్డు, ఆయుష్మాన్, ఆరోగ్య కార్డు, కులం ధ్రువీకరణ పత్రం, కిసాన్ క్రెడిట్ కార్డు, జన్‌ధన్ అకౌంట్ తదితర లాభాలు చేకూర్చడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏటీడీవోలు శ్రీనివాస్, చిరంజీవి, కార్యదర్శులు మధుకర్, ఉపాధ్యాయులు శంకర్, గోపాల్, మమత, కవిత, తిరుపతి, పోశం, తిరుపతి, కిష్టయ్య పాల్గొన్నారు.



### వలస లంబాడాలతో

## ఆదివాసీలకు అన్యాయం

### తుడుం దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేష్

**తలమడుగు, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**

ఎస్టీ జాబితా నుంచి లంబాడా లను తొలగించాలని జిల్లాలో ఆదివాసీల ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. సుప్రీంకోర్టు కోరిన నివేదికను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే కోర్టుకు అందజేసి, ఆదివాసీల పక్షాన నిలబడాలని జిల్లా వ్యాప్తంగా మహా పాదయాత్ర లుఖ్ చేపడుతున్నారు. ఇందులో భాగంగానే గురువారం ఆదివాసి హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ), పంచాయతీ రాయిసెంటర్, 9 తెగల సంఘాల ఆధ్వర్యంలో తలమడుగు మండల కేంద్రంలో మహా పాదయాత్ర చేపట్టారు. స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి తాహసిల్దార్ కార్యాలయం వరకు భారీ వర్షంలో పాదయాత్ర నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కు మెమోరాండం ఇచ్చారు. ఈ సందర్భంగా తుడుం దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేష్ మాట్లాడుతూ మేధావులు, విద్యావంతులు అందరు ఆదివాసి పక్షాన నిలబడి ఆదివాసులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. అక్రమంగా వలసవచ్చిన లంబాడాలతో అమాయకమైన ఆదివాసీల విద్యా, ఉద్యోగం రాజకీయం, ఉపాధి అవకాశాలు, రిజర్వేషన్ దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కోడప నగేష్, పుర్క బాపురావ్, ఆది వాసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు పెందోర్ పుష్ప రాణి, జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక బాయి, జిల్లా ఉపాధ్యక్షురాలు ఉయిక ఇంద్ర బాయితో పాటు పెద్ద ఎత్తున ఆదివాసీలు పాల్గొన్నారు.

## చేపల వేటకు వెళ్లొద్దు


**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మత్స్య శాఖ అధికారి సాంబశివ రావు అన్నారు. వానలు పడుతున్నందున ఎవరు కూడా చెరువులు, ప్రాజెక్టులు, రిజర్వాయర్ల, కుంటలు, వాగులో చేపల వేటకు, చేపల వలలు తీయడానికి వెళ్లకూడదన్నారు. రెండు, మూడు రోజుల పాటు జిల్లాకు వర్ష సూచన ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సాంబశివ రావు హెచ్చరించారు. సరదాకోసం ఎవరైనా ప్రాజెక్టులు, చెరువుల, వాగుల వద్దకు వెళ్లి చిక్కుకుంటే వారిని కాపాడాలని గజ ఈతగాళ్లకు సూచించారు. వర్షాల ప్రభావం తగ్గే వరకూ అధికారుల సూచనలు అందరూ పాటించాలని ఆయన పేర్కొన్నారు.



## 'రాజాసాబ్' ప్లానింగ్ అదుర్స్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా, మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ది రాజాసాబ్' గురించి ఆసక్తికరమైన అప్‌డేట్ ఒకటి బయటకు వచ్చింది. ఈ సినిమా ఫస్ట్ ట్రైలర్‌కు సంబంధించిన రన్ టైం లాక్ అయినట్లు సమాచారం. ట్రైలర్ నిడివి దాదాపు 3 నిమిషాల 30 సెకన్లు ఉండనుందని టాక్ వినిపిస్తోంది. ఇక ఈ ట్రైలర్‌ను అక్టోబర్ 2న విడుదలవుతున్న కాంతారా చాప్టర్ 1' సినిమాతో పాటు థియేటర్లలో ప్రదర్శించనున్నారని సమాచారం. అంటే, కాంతారా సినిమా థియేటర్‌కి వెళ్ళిన ప్రేక్షకులకు ప్రభాస్ 'రాజాసాబ్' సినిమా ట్రైలర్ బోనస్ ఉండనుంది. ప్రభాస్ ఈసారి హారర్ ఫాంటసీ, రొమాంటిక్ ఎంటర్టైనర్ చిత్రంలో కనిపించనున్నాడు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా మీద అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ప్రభాస్ నుంచి చాలా రోజుల తర్వాత ఒక రొమాంటిక్ కంటెంట్ ఉన్న సినిమా వస్తుండటం వల్ల ఫ్యాన్స్ ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. మూవీ టీం ఇప్పటికే షూటింగ్‌ను చాలావరకు పూర్తిచేసి, ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ పనులు జరుపుతోంది. సంక్రాంతి కానుకగా 2025 మొదట్లో సినిమాను విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఇక ఈ ట్రైలర్ విషయంలో ఇప్పటికే మేకర్స్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అధికారికంగా విడుదల తేదీపై ప్రకటన రావాల్సి ఉన్నప్పటికీ, అక్టోబర్ 2న థియేటర్లలో ట్రైలర్ రావడం ఖాయంగా అనిపిస్తోంది. ఇక ఈ ట్రైలర్‌లో ప్రభాస్ పాత్ర ఎలా ఉండబోతుందో, సినిమా టోన్ ఏ విధంగా ఉంటుందో క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. మొత్తంగా చూస్తే, ప్రభాస్ ఫ్యాన్స్‌కి ఇది చాలా ఎగ్జయిటింగ్ అప్‌డేట్. ప్రభాస్ మాస్ అండ్ క్లాస్ ఇమేజ్‌కి తగినట్టుగా ఈ ట్రైలర్ ఉండబోతుందని టీమ్ చెబుతోంది. ఒకవైపు కాంతారా సినిమాతో విజువల్ ట్రీట్, మరోవైపు ప్రభాస్ ట్రైలర్‌తో థియేటర్‌లో హంగామా జరగనుంది.



## అప్పుడే 'ఓజీ' ఓటీటీ డీల్ ఫిక్స్

రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ చూసిన పవర్ స్టార్ 'ఓజీ' వైబ్స్ కనిపిస్తున్నాయి. పవన్ కళ్యాణ్ ఫ్యాన్ బాయ్ డైరెక్టర్ సుజిత్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా థియేటర్స్ లో విడుదలైంది. అభిమానుల అంచనాలకు తగ్గట్లే సినిమా సూపర్ హిట్ టాక్ సొంతం చేసుకుంటోంది. ఈరోజు రాత్రి ప్రీమియర్ షోల నుంచే సంబరాలు షురూ చేశారు పవన్ ఫ్యాన్స్. థియేటర్ల ముందు బాణా సంచా కాలుస్తూ, రివ్యూలు చెబుతూ రచ్చ రచ్చ చేస్తున్నారు. పవన్ కళ్యాణ్ అభిమానిగా ఆయనను అభిమానులకు ఎలా చూపించాలో బాగా అర్థం చేసుకున్నాడు డైరెక్టర్ సుజీత్. కథ రొటీన్ అయినప్పటికీ.. తన డిఫరెంట్ స్టైల్ ఆఫ్ మేకింగ్, స్క్రీన్ ప్లేతో ఫ్యాన్స్ కి ఫుల్ కిక్కిచ్చాడు. సినిమాలో పవర్ స్టార్ స్టైల్, యాక్షన్ సీన్స్, డైలాగ్స్ ఫుల్ మీల్స్‌లా ఉన్నాయి. తమన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రతీ సీన్ ని మరింత ఎలివేట్ చేసింది. మొత్తానికి బాక్సాఫీస్ బ్లాక్ బస్టర్ హిట్ అనిపించుకుంది 'ఓజీ'. థియేటర్స్ లో విడుదలై ఒక్కరోజు కూడా కాకముందే.. అప్పుడే 'ఓజీ' ఓటీటీ డీల్ వివరాలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. 'ఓజీ' డిజిటల్ రైట్స్ ప్రముఖ ఓటీటీ ప్లాట్ ఫార్మ్ నెట్ ఫ్లిక్స్ భారీ ధరకు దక్కించుకున్నట్లు తెలుస్తోంది. దాదాపు రూ. 92 కోట్లు ఓజీ రైట్స్ అమ్ముడైనట్లు సినీ వర్గాల్లో టాక్. పవన్ కళ్యాణ్ కెరీర్ లోనే ఇది అతి పెద్ద ఓటీటీ డీల్ అని తెలుస్తోంది. సాధారణంగా.. థియేటర్లలో విడుదలైన తర్వాత 4 నుంచి 8 వారాల మధ్య ఓటీటీలోకి వస్తుంది. లేదా అంతకంటే ముందే దీపావళి కానుకగా ఓటీటీలోకి వచ్చే ఛాన్స్ కూడా ఉందని వార్తలు వినిపిస్తున్నాయి. స్ట్రీమింగ్ తేదీ ఎప్పుడనే దానిపై ఇంకా అధికారిక ప్రకటన లేదు.



## టిల్లు బ్యూటీకి బిస్కెట్..

పవర్ స్టార్ హీరోగా పవన్ కళ్యాణ్ ఫ్యాన్ బాయ్ డైరెక్టర్ సుజీత్ తెరకెక్కించిన గ్యాంగ్ స్టార్ డ్రామా 'ఓజీ' ఈరోజు భారీ అంచనాల ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అంచనాలకు తగ్గట్లే సూపర్ హిట్ టాక్ తో థియేటర్స్ లో దుమ్మురేపుతోంది. చాలా కాలం తర్వాత పవన్ ఫ్యాన్స్ కు కిక్కిచ్చే సినిమా వచ్చిందంటూ సంబరాలు చేసుకుంటున్నారు అభిమానులు. సినిమాలో పవన్ చాలా కొత్తగా స్టైలిష్ అండ్ పవర్ ఫుల్ ఫుల్ గ్యాంగ్ స్టార్ పాత్రలో కనిపించడం ఫ్యాన్స్ లో ఉత్సాహాన్ని నింపింది. పవన్ డైలాగ్స్, ఎంట్రీ సీన్లు, యాక్షన్ సీక్వెన్స్ లకు థియేటర్లు అరుపులు, కేకేలతో దద్దరిల్లిపోయాయి. అయితే ఈ సినిమాలో 'డీజే టిల్లు' బ్యూటీ నేహా శెట్టి స్పెషల్ సాంగ్ లేకపోవడం కొంతమంది ఫ్యాన్స్ కు నిరాశ కలిగించింది. విడుదలకు ముందు నుంచే 'ఓజీ' లో నేహా స్పెషల్ సాంగ్ ఉండబోతుందని వార్తలు వచ్చాయి. ఓ ఈవెంట్ లో నేహా కూడా ఈ విషయాన్ని స్వయంగా వెల్లడించారు. గ్యాంగ్ స్టార్ డ్రామా నేపథ్యంలో ఫుల్ యాక్షన్ మోడ్ లో సాగే ఈ చిత్రంలో నేహా స్పెషల్ సాంగ్ సినిమాకు మంచి గ్లామర్ జోడిస్తుందని భావించారు. కానీ, థియేటర్స్ లో సాంగ్ లేకపోవడంతో ఎడిటింగ్ లో తీసేసినట్లు తెలుస్తోంది.



## బ్లాక్ డ్రెస్ లో అలియా కిల్లింగ్ లుక్స్..

బాలీవుడ్ బ్యూటీ అలియా భట్ తన ఫ్యాషన్ సెన్స్ తో తరచూ ప్రేక్షకులను ఫిదా చేస్తుంటారు. తాజాగా బ్లాక్ ఉలెన్ శాలువాతో కప్పబడిన స్టైలిష్ అవుట్ ఫిట్ లో నెట్టింట స్టన్నింగ్ ఫొటో షూట్ షేర్ చేశారు. స్టైలిష్ అవుట్ ఫిట్ లో అలియా ఫొజులు నెటిజన్లను ఫిదా చేస్తున్నాయి. సిల్కీగా, మెరుస్తున్న జుట్టు, సింపుల్ మేకప్ ఆమె అందాన్ని రెట్టింపు చేశాయి. ఈ ఫొటోలను అలియా తన ఇన్ స్టాలో షేర్ చేసిన 24 గంటల్లోనే మిలియన్ వ్యూస్, వేలలో కామెంట్స్ వచ్చాయి. ఇవి చూసిన నెటిజన్లు స్టన్నింగ్ ఆలియా అంటే ఫైర్ ఈమోజీలతో కామెంట్లు పెడుతున్నారు. అలియా ప్రస్తుతం బాలీవుడ్ లో వన్ ఆఫ్ ది స్టార్ హీరోయిన్ గా రాణిస్తోంది. వరుస ప్రాజెక్టులు చేస్తూ ఫుల్ బిజీగా ఉంది. ప్రజెంట్ ఆలియా నటిస్తున్న 'అల్ఫా' మూవీ షూటింగ్ ఇప్పటికే పూర్తవగా.. పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. మరోవైపు 'లవ్ అండ్ వార్' అనే ఇంకో ప్రాజెక్ట్ చిత్రీకరణ దశలో ఉంది. బాలీవుడ్ తో పాటు టాలీవుడ్ లోనూ సత్తా చాటింది అలియా. తెలుగులో రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన 'ఆర్ఆర్ఆర్' సీత పాత్రలో ప్రేక్షకులను ఫిదా చేసింది. సోషల్ మీడియాలో ఫుల్ యాక్టీవ్ కనిపించే అలియాకు 86 మిలియన్ పైగా ఫాలోవర్లు ఉన్నారు. ప్రస్తుతం అలియా సినిమాలతో బిజీగా ఉంటూనే మరోవైపు మదర్ హుడ్ కూడా ఎంజాయ్ చేస్తోంది. షూటింగ్ సమయం దొరికినప్పుడుల్లా కూతురు 'రాహా' టైం స్పెండ్ చేస్తుంటారు.

## EMI కట్టలేదని స్టార్ హీరో ఇల్లు వేలానికి!



తమిళ స్టార్ హీరో జయం రవి అలియాస్ రవి మోహన్ మరోసారి వార్తల్లో నిలిచారు. చెన్నైలోని ఇంజంబక్కంలో ఉన్న ఆయన విలాసవంతమైన బంగ్లాను సీజ్ చేస్తామని నోటీసులు పంపారు అధికారులు. అయితే గత 11 నెలలుగా ఇంటికి సంబంధించిన ఈఎంఐ వాయిదాలు చెల్లించకపోవడంతో ఇంటిని జప్తు చేస్తామని ఇంటి తలుపులకు నోటీసులు అతికించారు. ఒక స్టార్ హీరో ఇంటి విషయంలో బ్యాంక్ అధికారులు తీసుకున్న ఈ చర్య నెట్టింట హాట్ టాపిక్ గా మారింది. అయితే రవి మోహన్ కి నోటీసులు పంపించడం ఇదేం మొదటి సారి కాదట. దీనికి ముందు బ్యాంక్ అధికారులు అనేక సార్లు రిమైండర్లు పంపించినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ ఆయన నుంచి ఎటువంటి స్పందన రాలేదని చెబుతున్నారు. రవి మోహన్ ఈ బంగ్లాను కొనుగోలు చేసేటప్పుడు ఒక ప్రైవేట్ బ్యాంక్ నుంచి పెద్దమొత్తంలో అప్పు తీసుకున్నారని, దానికి సంబంధించిన నెలవారీ వాయిదాలు చాలా పెండింగ్ లో ఉన్నాయని తెలిసింది. ప్రస్తుతం ఈ ఇంటిపై రూ. 7.60కోట్ల బకాయి ఉందని అధికారులు నోటీసులో పేర్కొన్నారు. గడువు తేదీలోపు బకాయిలు చెల్లించకపోతే ఇంటిని వేలానికి వేస్తామని తెలిపారు. కొద్దిరోజులుగా భార్య ఆర్తితో విడాకుల వ్యవహారం కారణంగా రవి ఆయన గర్ల్ ఫ్రెండ్ కేనీషాతో ఉంటున్నారని సమాచారం. ఈ క్రమంలోనే ఇంటి ఈఎంఐ చెల్లించలేదని తెలుస్తోంది. దీంతో ఆయన భార్య పిల్లలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని నటుడు రవిని విమర్శిస్తున్నారు నెటిజన్లు.

# కారుణ్య నియామకాలపై గుడ్ న్యూస్

**పట్టభద్రులైన వారసులకు క్లరికల్ గ్రేడ్-3 పోస్టులు**

**గుర్తింపు కార్మిక సంఘం, సింగరేణి యాజమాన్యం మధ్య ఒప్పందం**





**బెల్లంపల్లి, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)** డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ కార్యాలయంలో గుర్తింపు కార్మిక సంఘం అయిన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్‌కు, సింగరేణి యాజమాన్యానికి మధ్య ఒక ఒప్పందం కుదిరింది. గతంలో ఈ విద్యార్హత కలిగిన వారు జనరల్ అసిస్టెంట్‌గా మాత్రమే పనిచేసే అవకాశం దక్కేది. 2009లో జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం టెక్నికల్ డిగ్రీలైన మైనింగ్, మెకానికల్, ఎలక్ట్రికల్, సివిల్ ఇంజనీరింగ్, డిప్లొమా(మైనింగ్/ మెకానికల్ /ఎలక్ట్రికల్), ఐటీఐ(ఎలక్ట్రికల్/ఫిట్టర్/వెల్డర్) కోర్సులు పూర్తి చేసిన వారికి విద్యార్హతలకు తగిన ఉద్యోగాలు కల్పించడానికి అంగీకరించారు. వీరితో పాటు ఇతర డిగ్రీలు కలిగిన అభ్యర్థులకు క్లరికల్ గ్రేడ్-3 పోస్టుల్లో నియామకం కల్పించాలని సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘమైన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ చేసిన విజ్ఞప్తి పై జూన్ 27వ తేదీన జరిగిన డైరెక్టర్ (పా) స్థాయి 51వ నిర్మాణాత్మక సమావేశంలో చర్చించడం జరిగింది. సంస్థ సీఎండీ ఎన్.బలరామ్, డైరెక్టర్ (పర్సనల్) గౌతమ్ పొట్రు ఆదేశాల మేరకు 2025 సెప్టెంబర్ 5న సింగరేణి ప్రధాన కార్యాలయంలో సింగరేణి గుర్తింపు కార్మిక సంఘమైన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్‌తో యాజమాన్యం ద్వైపాక్షిక ఒప్పందం చేసుకుంది. యూనియన్ ప్రతినిధులు, డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ సమక్షంలో మరోమారు చర్చల అనంతరం త్రైపాక్షిక ఒప్పందానికి అంగీకరించడంతో గురువారం తాజా ఒప్పందం జరిగింది. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ (సెంట్రల్) విశ్వ భూషణ్, సింగరేణి తరఫున డైరెక్టర్ (పా) గౌతమ్ పొట్రు, జీఎం(యాజమైన్స్) వై.రఘు రామి రెడ్డి, జీఎం(పర్సనల్) ఐఆర్ అండ్ పిఎం కవితా నాయుడు, జీఎం (హెచ్‌ఆర్డి) టి.వెంకటరామ రెడ్డి, జీఎం (సివిల్) డి.వెంకటేశ్వర్లు, జీఎం (ఎంఎస్) రవి బొజ్జా, గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, నాయకులు ఎం.రంగయ్య, కె.వీరభద్రయ్య, ఎం. సమ్మయ్య, మద్దీ ఎల్లయ్య, వై.వి.రావు పాల్గొన్నారు. ఒప్పంద వివరాలు.. గని ప్రమాదంలో మృతిచెందిన ఉద్యోగి కుటుంబంలో అర్హలైన టెక్నికల్ డిగ్రీ ఉన్న వారసులు లేని పక్షంలోనే ఏదైనా ఇతర డిగ్రీ అర్హత ఉన్న వారు గ్రేడ్ 3 క్లర్క్ పోస్టుకు అర్హులు. సంస్థలో గ్రేడ్ 3 క్లర్క్ పోస్టుల లభ్యతను బట్టి కంపెనీ వీరికోసం నిర్వహించే ప్రత్యేక పరీక్షలో డిగ్రీ అర్హత గల వారసులు పాల్గొనాల్సి ఉంటుంది. పరీక్షలో పాసైన వారు మాత్రమే గ్రేడ్ 3 క్లర్క్ పోస్టుల్లో నియామకానికి అర్హత సాధిస్తారు. గ్రేడ్-3 క్లర్క్ పోస్టుల అర్హత పరీక్షలో ఉత్తీర్ణులు కాని వారసులకు జనరల్ అసిస్టెంట్‌గా అవకాశం కల్పిస్తారు.



## పెండింగ్ వేతనాలు చెల్లించాలి

**నిర్మల్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)** నిర్మల్ జిల్లాలో గ్రామపంచాయతీలో పనిచేస్తున్న మల్టీపర్పస్ వర్కర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని సిఐటియు గ్రామపంచాయతీ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. గురువారం కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి నాలుగు నెలల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని అదనపు కలెక్టర్ అదనపు కలెక్టర్ ఫైజాన్ హమ్మద్‌కు వినతి పత్రం అందించారు.

**అర్హులైన నిరుపేదలందరికీ**

## ఇళ్ల పట్టాలు ఇవ్వాలి



**ఖానాపూర్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)** నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపాలిటీలో డబుల్ బెడ్ రూమ్ అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్ల పట్టాలు వెంటనే ఇవ్వాలని సిపిఐ ఎమ్మెల్ మాస్ లైన్ ఆధ్వర్యంలో ఖానాపూర్ పట్టణంలో భారీ ర్యాలీ, తాసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు. గురువారం డబుల్ బెడ్ రూమ్ లోఇది వరకే నివాసముంటున్న అర్హులైన నిరుపేదలకు వెంటనే ఇల్ల పట్టాలు అందజేయాలని, అనర్హులను ఖాళీ చేయించాలని ర్యాలీ నిర్వహించి ఖానాపూర్ తాసిల్దార్ సుజాత రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

**కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి**

## వేడుకలు నిర్వహించాలి

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)** స్వతంత్ర ఉద్యమకారుడు, పీడిత ప్రజల విముక్తికి జీవితాన్ని అంకితం చేసిన మహానీయుడు ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ 110 జయంతి వేడుకలను జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహించుకోవాలని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుకుల్లా ఆంజనేయులు పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని మండలాలు గ్రామాలలో బాపూజీ జయంతి వేడుకలు నిర్వహించాలని కోరారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్లో ప్రభుత్వం బాపూజీ జయంతిని అధికారికంగా నిర్వహించడం జరుగుతుందని పద్మశాలీలు శుక్రవారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌కు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. వేడుకల్లో తెలంగాణ వాదులు, బడుగు బలహీనవర్గాల ప్రజలు, వివిధ రాజకీయ పార్టీల,ప్రజా, కుల సంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు.



## ప్రకృతిని ఆరాధించే పండుగ బతుకమ్మ



**ఇంద్రవెల్లి, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)** తెలంగాణలో బతుకమ్మ పండుగ ప్రకృతిని ఆరాధించే పెద్ద పండుగ అని క్రిసెంట్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కాక్ నాటే బాలాజీ అన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని స్థానిక క్రిసెంట్ జూనియర్ కళాశాలలో తెలంగాణ సాంస్కృతి, సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలను కళాశాల విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు రంగు, రంగుల పూలతో బతుకమ్మలను తయారు చేసి ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా క్రిసెంట్ ప్రిన్సిపాల్ కాక్ నాటే బాలాజీ మాట్లాడుతూ..తెలంగాణ సంస్కృతి, సంప్రదాయానికి బతుకమ్మ పండుగ ప్రతీకని కొనియాడారు. అనంతరం సమీపంలోని చెరువులో బతుకమ్మను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వినోద్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కోసం వర్షంలో బారులు



**చెన్నూర్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)** సుందరశాలలో గురువారం యూరియా పంపిణీ చేయగా, ముత్తరావుపల్లి, దుగ్నెపల్లి, చెల్లాయిపేట, నర్సక్కపేట గ్రామాల నుంచి సుమారు 800 మంది రైతులు తరలివచ్చి క్యూ కట్టారు. వర్షంలో తడుస్తూ క్యూ లైన్లో వేచి ఉన్నారు. సుందరశాలకు 266, అంగ్రాజ్‌పల్లికి 222 బస్తాలు అందుబాటులో ఉన్నాయి. రైతులకు సరిపడా యూరియా రాకపోవడంతో వ్యవసాయ శాఖ అధికారులను రైతులు నిలదీశారు. చెన్నూర్ సీఐ దేవేందర్, ఎస్ఐ సుబ్బారావు ఆధ్వర్యంలో యూరియా బస్తాలు పంపిణీ చేశారు. అటు అంగ్రాజ్‌పల్లి రైతు వేదికలో బావురావుపేట, అంగ్రాజ్‌పల్లి రైతులకు టోకెన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ బానోత్ ప్రసాద్, ఏవో యామిని, ఏఈవోలు వనదేవి, అర్చన పాల్గొన్నారు.

**యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు...**

రెబ్బెన మండల కేంద్రంలో గురువారం యూరియా కోసం రైతులు రోడ్డెక్కారు. ఉదయం రెబ్బెన పీఏసీఎస్ కార్యాలయానికి చేరుకొని యూరియా అందించాలని కోరారు. వర్షం పడుతుందని, గోదాం తెరిస్తే వర్షం నీరు లోపలికి వెళ్లి యూరియా బస్తాలు తడిసిపోతాయని రెబ్బెన వ్యవసాయశాఖ అధికారి దిలీప్ రైతులకు సూచించారు. వర్షం తగ్గిన తర్వాత యూరియా పంపిణీ చేస్తామని రైతులకు చెప్పగా, అనేక మంది రైతులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. కొందరు మాత్రం యూరియా ఇవ్వాలని పట్టుబట్టి పీఏసీఎస్ కార్యాలయం ముందు గల అంతర్రాష్ట్ర రహదారిపైకి కి చేరుకొని ఆందోళన చేపట్టారు. ఎస్ఐ వెంకటకృష్ణ అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడి పంపించారు.

## 108 అంబులెన్స్‌లో ప్రసవం



**జైనూర్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)** మండలంలోని డబోలి గ్రామపంచాయతీ పరిధిలో గల ఉన్న జాదుగూడా గ్రామానికి చెందిన సీడం భూమేశ్వరి (25) గర్భవతి ఓ గిరిజన మహిళ పురిటి నొప్పులతో మార్గం మధ్యలోనే మగ శిశువును జన్మం చింది అని 108 పైలెట్ ప్రశాంత్ తెలిపారు. ప్రసవం అవడం తో జైనూర్ ఆస్పత్రికి 108 అంబులెన్స్ ద్వారా తీసుకోవచ్చారు. తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నారని తెలిపారు. సుఖ ప్రసవం చేసిన ఈఎంటీ, పైలట్ దయాకర్‌కి ధన్య వాదలు తెలిపారు.



## జైనథ్ సీఐగా శ్రావణ్ కుమార్

**నిజామాబాద్ సీసీఎస్‌కు సాయినాథ్ బదిలీ**

**జైనథ్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)** జైనథ్ సర్కిల్ కార్యాలయానికి నూతన సీఐగా హైదరాబాద్ సైబర్ సెక్యూ రిటీ విభాగంలో పని చేస్తున్న జి.శ్రావణ్ కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. జైనథ్ సర్కిల్ పూర్తిగా మహారాష్ట్ర సరిహద్దులో ఉన్నందున అసాంఘిక కార్యకలాపాలకు ఎలాంటి ఆస్కారం లేకుండా పటిష్టమైన చర్యలను చేపట్టాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. ఇదివరకు జైనథ్ సీఐగా పనిచేసిన సాయినాథ్ నిజామాబాద్‌కు బదిలీపై వెళ్లనున్నారు.

**కుక్కల, పందుల బెడద**

## నివారణకు చర్యలు తీసుకోండి



**ఉట్నూర్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)** కుక్కల,పందుల బెడదకు నివారణ చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణీ రాజేష్ అన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ ప్రభాకర్ రావును కలసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుక్కలు,పందులు గుంపులు గుంపులుగా తిరుగుతూ ఇంట్లోకి వచ్చి భీభత్సం సృష్టిస్తున్నాయని పేర్కొన్నారు. మహిళలకు, చిన్నారులకు ఇబ్బందిగా మారిందని, ప్రమాదం జరగకుండా ముందస్తుగా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల సోషల్ మీడియా ప్రధాన కార్యదర్శి బాబా శ్యాం, దినేష్ పాల్గొన్నారు.

# విద్వేషాలు రెచ్చగొట్టేలా పోస్టు చేసిన వ్యక్తి రిమాండ్



- ముంబై ఎయిర్ పోర్ట్‌లో నిందితుడి పట్టివేత
- పాస్‌పోర్ట్, రెండు పోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)** టాంజానియా దేశంలో ఉంటూ ఇరువర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా వాట్సప్ గ్రూప్‌లో పోస్ట్ పెట్టిన వ్యక్తి ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి తెలిపారు. గురువారం వన్ టౌన్ పీఎస్‌లో సమావేశం నిర్వహించి కేసు వివరాలను వెల్లడించారు. ఏప్రిల్ నెలలో ఆదిలాబాద్ కు చెందిన రౌడీ షీటర్ క్రైంచి సలీం ప్రజలను భయభ్రాంతులకు గురి చేసేలా పోస్ట్ పెట్టినందుకు అతనిపై రూరల్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి అరెస్టు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ సంఘటనపై నిందితుడు షేక్ ఇర్ఫాన్ టాంజానియా దేశంలో ఉంటూ ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించినటువంటి సిల్.సిల ఏడీబీ అనే వాట్సప్ గ్రూపు యజమానిగా వ్యవహరిస్తూ, వాట్సాప్ గ్రూపులో పోలీసులను కించపరిచేలా, ప్రజాశాంతికి భంగం కలిగించేలా విమర్శలు చేసి ఇరు వర్గాల మధ్య గొడవలు దారి తీసేలా పోస్టులు పెట్టినందుకు అతనిపై ఏప్రిల్ 15న టు టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయిందని పేర్కొన్నారు. అతను ఇతర దేశంలో ఉన్నందున జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన సిఫార్సు మేరకు అతనిపై ఇమిగ్రేషన్ అధికారులు లుక్ అవుట్ సర్కులర్ జారీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ ఘటనతో మంగళవారం టాంజానియా నుండి ముంబై అంతర్జాతీయ విమానాశ్రయానికి రాగా, ఇదివరకే ఇతనిపై ఎల్ఓసి జారీ అయిన విషయాన్ని గుర్తించిన ఇమిగ్రేషన్ అధికారులు అతనిని పట్టుకొని ముంబై అంతర్జాతీయ విమానాశ్రయ పోలీసులకు అప్పజెప్పారు. జిల్లా పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్సై పీర్ సింగ్ ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం అతడిని పట్టుకొని అరెస్టు



చేయడం జరిగిందన్నారు. గురువారం న్యాయమూర్తి ముందు ప్రవేశపెట్టగా14 రోజుల జ్యూడిషల్ రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు. ఇరు వర్గాల మధ్య చిచ్చుపెట్టేలా గొడవలకు దారి తీసేలా పోస్టులు పెట్టిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. వాట్సప్ గ్రూపులలో సోషల్ మీడియాలో పోలీసులను కించపరిచేలా, పోలీసు విధులకు భంగం కలిగించేలా, మనోభావాలకు దెబ్బతీసేలా పోస్ట్ పెట్టిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇతని వద్దనుండి ఒక పాస్ పోర్ట్, రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో టు టౌన్ ఇన్స్పెక్టర్ కె.నాగరాజు, ఎస్ఐ పీర్ సింగ్, విష్ణు ప్రకాష్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఉరేసుకొని సింగరేణి కార్మికుడి ఆత్మహత్య

**రామకృష్ణాపూర్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)** మందమర్రి మండలం రామకృష్ణాపూర్ పట్టణం జవహర్ నగర్‌లో నివాసముంటున్న రెక్కల గోవర్ధన్ రెడ్డి (42) ఆర్కేపిసిహెచ్పిలో సింగరేణి కార్మికుడుగా పనిచేస్తున్నాడు. ఇంట్లో జరిగిన గొడవల కారణంగా మనస్థాపానికి గురై బుధవారం అర్ధరాత్రి ఫ్యాన్‌కి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టుపక్కల ఉన్న వారు సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు చనిపోయాడని తెలిపారు. కాగా మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

## బ్రాండెడ్ రైస్ పేరుతో మోసం

### నిందితుడి అరెస్ట్



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)** ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని శివాజీ చౌక్ ప్రాంతంలో ఆంధ్ర కిరాణం యజమాని నిందితుడు షేక్ అయూబ్ బ్రాండెడ్ రైస్ సంచులలో పీడీఎస్ రైస్ నింపుతూ అమాయక ప్రజలను మోసం చేస్తున్న ఘటనలో నిందితుని అరెస్టు చేసినట్లు వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఇతను ఇదివరకే పలు కేసులలో నిందితుడిగా ఉన్నట్లు పేర్కొన్నారు. నిందితుడి వద్ద నుండి 6 క్వింటాళ్ల రాయితీ బియ్యం,ఒక ఆటోను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా దుకాణాన్ని జప్తు చేయడం కోసం ఆదిలాబాద్ ఆర్డీఓకు సిఫార్సు చేశామని తెలిపారు.

## ఎలుగుబంటి దాడిలో ఇద్దరికి తీవ్ర గాయాలు

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)** మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం మైలారం పరిసరాల్లో మూడు ఎలుగుబంట్లు ఇద్దరు వ్యక్తులపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. గురువారం మైలారం గ్రామంలోని దుబ్బపల్లికి చెందిన హర్ష, మారయ్య, గావిడి. మల్లేష్‌లు పత్తి చేనులో పనులు చేస్తుండగా మూడు ఎలుగుబంట్లు ఒక్కసారిగా వారిపై దాడి చేయడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. కేకలు వేయడంతో సమీప ప్రాంతాల్లో ఉన్న రైతులు గమనించి 108 వాహనంలో బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.



## ఏఎన్ రెడ్డి కాలనీలో భారీగా సొత్తు చోరీ



**నిర్మల్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)** నిర్మల్ పట్టణంలోని ఏఎన్ రెడ్డి కాలనీలో గురువారం తెల్లవారుజామున చోరీ జరిగింది. సారంగాపూర్ హై స్కూల్ లో స్కూల్ అసిస్టెంట్ గా పని చేస్తున్న రమేష్ చందర్ గౌడ్ ఇంట్లో గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. బాధితుల కథనం ప్రకారం వీరి కూతురు, అల్లుడు వృత్తి రీత్యా మహారాష్ట్రలో ఉండడంతో ఆయన సతీమణి ఇటీవల వారి వద్దకు వెళ్లారు. దసరా సెలవులు కావడంతో ఈనెల 22న మధ్యాహ్నం రమేష్ చందర్ గౌడ్ కూడా మహారాష్ట్రకు వెళ్లారు. కుటుంబ సభ్యులను తీసుకువచ్చేందుకు వెళ్లగా... ఈ సంఘటన చోటుచేసుకుంది తెల్లవారుజామున పనిమనిషి ఇంటికి వచ్చి చూడగా తాళం పగలగొట్టి ఉంది. ఈ విషయాన్ని రమేష్ చందర్ గౌడ్ కుటుంబ సభ్యులకు ఫోన్లో సమాచారం అందించారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారు ఐదున్నర కేజీల వెండి, తులం నర బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. క్లూస్, ఫింగర్ ప్రింట్ టీంలు చేరుకుని చోరీ ఘటనపై వివరాలు సేకరించారు. సంఘటన పట్టణంలో కలకలం రేపింది.

## పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)** పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని హనుమాన్ నగర్ చోటు చేసు కుంది. సీఐ కర్రె స్వామి తెలిపిన వివరాల మేరకు కాలనీలో నివాసముంటున్న సామ అశోక్ రెడ్డి (55)కి భోరజ్ మండలంలోని పెండల్వాడలో తనకున్న నాలుగెకరాల్లో ఈ ఏడాది పత్తి సాగు చేశాడు. ఆశించిన పంట దిగుబడి వచ్చేలా కనిపించకపోవడంతో పంట సాగుకు తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలని మనస్తాపంతో పురుగుల మందు తాగడంతో గమనించిన కుటుంబసభ్యులు రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

## అక్రమ కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలి



### ఎస్పీ కాంతిలాల్ పాటిల్

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)** అక్రమ కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపాలని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. గురు వారం కాగజ్ నగర్ పట్టణంలోని ఈస్లాం పోలీస్ స్టేషన్ ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్‌లో 5ఎస్ అమలు. రికార్డ్ రూంతో పాటు పెండింగ్ కేసుల వివరా లను ఎస్ఐ ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు ప్రజా సమస్యల పైన వెంటనే స్పందిస్తూ బాధితులకు సత్వర న్యాయం. భరోసా కల్పించే విధంగా విధులు నిర్వర్తించాలని. పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి సారించి. విలేజ్ పోలీస్ అధికారులు గ్రామాలను తరుచూ సందర్శించాలన్నారు. 100 కాల్స్ కి వెంటనే స్పందించాలని. పాత నేరస్థులపై నిఘా ఉంచాలని. నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రజలతో సత్సంబంధాలను మెరుగుపరచుకుంటూ ప్రజలకు గం జాయి వలన కలుగు అనర్థాలు. మహిళ చట్టాలు. సైబర్ నేరాలు. మొదలగు వాటిపై అవగాహన కల్పించాలన్నారు. సీసీ కెమెరాల వినియోగంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా మైనర్లు వాహనాల డ్రైవ్ చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో డీఎస్పీ, సీఐలతో కలిసి మొక్కలు నాటారు.

## అనారోగ్యంతో బలవన్మరణం

**జైపూర్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)** మండలంలోని ఇందారం క్రాస్ రోడ్డు సమీపంలో రాజీవ్‌రహదారి పక్కన అటవీ ప్రాం తంలో మంచిర్యాల పట్టణం హెటెక్ సిటీ కాలనీకి చెందిన బోయిని శంకర్(35) అలియాస్ రాఘవులు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం. శంకర్ గత ఐదేళ్లుగా కడుపు, ఒళ్లునొప్పులతో బాధపడుతున్నాడు. కరీంనగర్ ఆస్పత్రిలో వైద్యం చేయించినా నయంకాలేదు. దీంతో మద్యానికి బానిసయ్యాడు. చేపలు విక్రయిస్తూ జీవించే శంకర్ ఇంట్లో నుంచి వచ్చి రెండు మూడు రోజులు బయట చేపలు విక్రయిస్తూ తిరిగి ఇంటికి వెళ్లేవాడు. ఇదే క్రమంలో గత 23న చేపలు విక్రయించడానికి వెళుతున్నానని చెప్పి 24న ఇందారం క్రాస్ రోడ్డు వద్దకు బస్సులో వచ్చి చెట్టుకు ఉరేసుకున్నాడు. తన చావుకు ఎవరూ కారణం కాదని, అనారోగ్య కారణాలతో ఆత్మహత్యకు పాల్పడినట్లుగా సూసైడ్ నోట్ లభించింది. మృతుడి తల్లి బోయిని భాగ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్సై శ్రీధర్ తెలిపారు.

## లైన్‌మెన్‌పై ఫిర్యాదు

**కోటపల్లి, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)** మండలంలోని దేవులవాడ సబ్ స్టేషన్ పరిధిలోని లైన్‌మెన్ రామకృష్ణపై ఓ మహిళా కార్యదర్శి ఎస్ఈకి ఫిర్యాదు చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని ఓ గ్రామ పంచాయతీ కార్యదర్శి విద్యుత్ పనుల నిమిత్తం ఎల్సీ విషయంలో లైన్‌మెన్ రామకృష్ణకు ఫోన్ చేసి మాట్లాడారు. ఆ తర్వాత నుంచి మధ్య మధ్యలో ఫోన్ చేసి అసభ్యకరంగా మాట్లాడుతూ విసిగిస్తున్నాడని కార్యదర్శి పేర్కొన్నారు. ఈ విషయమై ఏఈకి ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ఎస్ఈ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాగా, సదరు లైన్‌మెన్ యూనియన్ బడా నాయకుడితోపాటు ఏఈ అండదండలు ఉండడంతో తనకేం కాదనే ధీమాతో ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో బొప్పారం గ్రామంలో రైతుల నుంచి డబ్బులు డిమాండ్ చేసిన లైన్‌మెన్ సస్పెండ్ చేసి చెన్నూర్ మండలానికి బదిలీ చేశారు. తిరిగి దేవుల వాడకు వచ్చినా అతడి ప్రవర్తనలో మార్పు రాలేదని తెలుస్తోంది. ఇటీవల ట్రాన్స్‌ఫార్మర్ల బిగింపులో డబ్బులు తీసుకున్నాడని ఆరోపణల నేపథ్యంలో అధికారులు విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదించారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.ఫిర్యాదుపై ఏఈ వెంకటేశ్వర్లును సంప్రదించగా.. ఫిర్యాదును ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిపారు.

## జల్ సంచయ్- జన భాగిధారిలో
# నిర్మల్ జిల్లాకు జాతీయ స్థాయిలో 2వ ర్యాంక్

**కోటి రూపాయల నగదు బహుమతి - నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**



**నిర్మల్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా దేశవ్యాప్తంగా మరోసారి ప్రత్యేక గుర్తింపు సాధించింది. నీటి సంరక్షణ, ప్రజల భాగస్వామ్యం, పర్యావరణ పరిరక్షణలో విశిష్ట కృషి చేసి, జల్ సంచయ్–జన భాగిధారి కార్యక్రమంలో జాతీయ స్థాయిలో వర్గం–2లో రెండవ ర్యాంక్ సాధించింది. ఈ ప్రతిష్టాత్మక విజయంతో పాటు జిల్లాకు ఒక కోటి రూపాయల నగదు బహుమతి లభించడం గర్వకారణంగా నిలిచింది. జల సంరక్షణలో భాగంగా చెరువులు, వాగులు, వానజల హార్వెస్టింగ్ స్ట్రక్చర్లు, చెక్‌డ్యాంలు నిర్మాణం, మరమ్మత్తులు చేపట్టడం, భూగర్భ జలాలను సంరక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం, ప్రజలను ప్రత్యక్ష భాగస్వాములను చేయడం నిర్మల్ జిల్లాకు ఈ జాతీయ గుర్తింపుని తెచ్చిపెట్టింది. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయివరకు ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్థానిక సంస్థల సమన్వయం వల్లే ఈ ఫలితం సాధ్యమైందని కేంద్ర పరిశీలక బృందం నివేదికలో పేర్కొంది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, ఇది నిర్మల్ జిల్లా ప్రజల కృషి, నిబద్ధతకు నిదర్శనం. అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది అందరూ కలిసి నీటి సంరక్షణలో చేసిన కృషి ఫలితమే ఈ జాతీయ ర్యాంక్. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి రంగాల్లో జాతీయస్థాయిలో అగ్రస్థానం సాధించేలా కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకాలకు ప్రజల భాగస్వామ్యం జతకలిసినప్పుడు ఎలా ఫలితాలు వస్తాయో నిర్మల్ జిల్లా మరోసారి నిరూపించింది. ఈ జాతీయ పురస్కారం జిల్లాకు గౌరవాన్ని మాత్రమే కాక, భవిష్యత్తు అభివృద్ధి కార్యక్రమాలకు మరింత ప్రేరణనిచ్చేలా నిలుస్తుందని తెలిపారు. జిల్లాకు అవార్డు రావడం ఉద్యోగులు సమష్టి కృషికి నిదర్శనమన్నారు.



**జైనథ్ ఆలయాన్ని పరిశీలించి**
## పురావస్తు శాఖ అధికారి
### గర్భగుడిలోకి వర్షం నీరు

**జైనథ్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**
జైనథ్ మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయ గర్భగుడి గత కొన్ని రోజుల నుంచి ఉరుస్తోంది. విషయం తెలుసుకున్న పురావస్తు శాఖ అధికారులు గురువారం ఆలయాన్ని సందర్శించారు. పురావస్తు శాఖ అధికారి లక్ష్మినారాయణ మాట్లాడుతూ.. శిఖరంపై పిచ్చిమొక్కలు పెరగడంతో మొక్కల వేరు వ్యవస్థ లోపలికి వెళ్లి వర్షం నీరు గర్భగుడిలోకి వస్తుందన్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట పురావస్తు శాఖ ఏఈ జేమ్స్, ఆలయ ఈవో చంద్రశేఖర్, ఆలయ కమిటీ చైర్మన్ రూకేష్ రెడ్డి, అశోక్ రెడ్డి, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

## నేడు చాకలి ఐలమ్మ జయంతి

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**
వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని ఈ నెల 26న అధికారికంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాజర్షి షా ఓ ప్రకటనలో తెలిపారు. రిమ్స్ ఆస్పత్రి ఎదుట ఐలమ్మ విగ్రహం వద్ద ఉదయం 10.30గంటలకు నిర్వహించనున్న కార్యక్రమానికి జిల్లాలోని రజక, బీసీ సంఘాల ప్రతినిధులు ఆధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. అదేవిధంగా రేపు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి ఈ నెల 27న ఉదయం 10.30 గంటలకు గాంధీ పార్కు సమీపంలోని బాపూజీ చౌక్ వద్ద కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని అధికారికంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాజర్షి షా ఓ ప్రకటనలో తెలిపారు. పద్మశాలి కులస్తులు, బీసీ సంఘాల ప్రతినిధులు, అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## జీఎంకు సన్మానం

**రెబ్బెన, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**
ఈ నెలలో పదవీ విరమణ పొందనున్న జీఎం ఫిటజరాల్డ్ ఏసు రత్నంని జీఎం ఎం.విజయ భాస్కర్ రెడ్డి, బెల్లంపల్లి ఏరియా అధి కారులతో కలిసి గురువారం జీఎం కార్యాలయంలో సన్మానిం చారు. ఈ సందర్భంగా ఫిటజ రాల్డ్ ఏసు రత్నం మాట్లాడుతూ... గత 37 తన సింగరేణి ఉద్యోగ జీవితాన్ని సింగరేణిలో వచ్చిన సాంకేతికత, ఉద్యోగుల సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలను ఏరియా అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రాజమల్లు, ఏరియా ఇంజినీర్ కృష్ణ మూర్తి ఉమాకాంత్ అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

## జల్ సంచయ్ జన్ భగీదారి అవార్డుకు మంచిర్యాల జిల్లా ఎంపిక

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**
జల్ సంచయ్ జన్ భగీదారి అవార్డుకు మంచిర్యాల జిల్లా ఎంపిక కావడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పూర్తయిన 84 వేల 549 పనులను కేంద్ర బృందంచే తనిఖీ చేసిన అనంతరం జిల్లాలో భూగర్భ జలాల అభివృద్ధికై ఎంతో లాభం జరిగిందని శాస్త్రజ్ఞులు ఖరారు చేస్తూ భావితరాలకు, వ్యవసాయ ఆధారిత పనులకు ఎంతో లబ్ధి చేకూరుతుందని తెలుపుతూ 2 కోట్ల రూపాయల అవార్డు మంచిర్యాల జిల్లాకు కేంద్రం ప్రకటించిందని తెలిపారు.

## జాతీయ స్థాయి పోటీలకు
# ఉమ్మడి ఆదిలాబాద్ రెఫెరీలు ఎంపిక



**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**
ఈ నెల 26వ తేదీ నుంచి 29వ తేదీ వరకు హైదరాబాద్‌లోని నిజాం కళాశాలలో జరిగే 17వ హెచ్ఎఫ్ఐ మిని బాల, బాలికల జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన నలుగురు రెఫెరీలుగా ఎన్నికయ్యారు. సునార్కర్ అరవింద్, దుర్గం రాజలింగు,గోగర్ల సాయి కుమార్,రాజశేఖర్ ఎంపికైనట్లు ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గోనె శ్యాంసుందర్, ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేష్ తెలిపారు. ఈ రెఫెరీలు గతంలోను జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారని వివరించారు. దేశ అత్యున్నత క్రీడా శిక్షణ సంస్థ నేతాజీ సుభాష్ చంద్రబోస్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ పటియాలలో క్రీడా శిక్షణ శిక్షకులుగా శిక్షణ పూర్తి చేశారని తెలిపారు. జాతీయ స్థాయిలో ఎంపిక కావడంతో ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ కోశాధికారి రమేష్ రెడ్డి, ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి రఘునాథ్ రెడ్డి, జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఇన్‌చార్జి ప్రెసిడెంట్ అరిగేలా మల్లికార్జున్ యాదవ్, డీడీ రమాదేవి అభినందించారు.

## దుర్గామాత వేషధారణలో చిన్నారి

**నిర్మల్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**
దసరా దేవి నవరాత్రుల సందర్భంగా అమ్మవారి వేషధారనలో ఓ చిన్నారి అందర్నీ అలరింపజేసింది. నిర్మల్ జిల్లా కేంద్రంలోని చింతకుంట వాడకి చెందిన అమ్ముల సిద్ధు. మనస్వీ కూతురు అమ్ముల మణి చైత్ర గురువారం దుర్గాదేవి వేషధారణలో అమ్మవారికి ప్రత్యేకంగా పూజించింది. దీని ద్వారా పిల్లల్లో భారతీయ సాంస్కృతి, సంప్రదాయాల గురించి అవగాహన కల్పించడమే కాకుండా వారిలో దేశభక్తి పెంపొందించేలా చైతన్య పరుస్తుందని ఈ చిత్రాన్ని చూసిన పలువురు నెటిజెన్లు ప్రశంసిస్తున్నారు.



## భీం వర్ధంతిని ఘనంగా నిర్వహించాలి



**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**
అక్టోబర్ 7వ తేదీన ఆదివాసీల ఆరాధ్య దైవం జల్ జంగల్ జమీన్ కోసం పోరాటం చేసి అసువులు బాసిన కుమ్రం భీం వర్ధంతి సందర్భంగా వేడుకల నిర్వాహణ ఉత్సవ కమిటీని గురువారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే కోవలక్ష్మి తన క్యాంపు కార్యాలయంలో సన్మానించారు. వర్ధంతి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించాలని ఎమ్మెల్యే సూచించారు. నూతనంగా ఏర్పడ్డ ఉత్సవ కమిటీ సభ్యులను అభినందించారు.



## విధుల్లో చేరిన ఏఎంవీఐలు

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**
జిల్లాకు ప్రభుత్వం కేటా యించిన ముగ్గురు ఏఎంవీఐలు టీ రంజితక్కు మార్, మోతె శ్వేత, శ్రీనిహారిక విధుల్లో చేరారు. జిల్లా రవాణాశాఖ అధికారి సిపెల్లి శ్రీనివాస్‌కు గురువారం రిపోర్ట్ చేశారు. వీరికి రవా ణాశాఖ కార్యాలయంలో బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం కార్యాలయంలో ఇద్దరు పనిచే స్తుండగా వీరి నియామకంతో ఈ సంఖ్య ఐదుకు పెరిగింది. కార్యాలయ విధుల నిర్వహణ, రోడ్డు సేఫ్టీ మెరుగుపడనుండగా, రవాణా శాఖ ఆదాయం పెరిగేందుకు తోడ్పడనుంది.

## సర్వేయర్ ఫలితాలు విడుదల

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**
లైసెన్స్‌డ్ సర్వేయర్ పరీక్షా ఫలితాలను ప్రభుత్వం విడుదల చేసింది. జిల్లాలో తొలి విడతలో నిర్వహించిన రాత పరీక్షలో ఫెయిలైన 109 మందికి ఇటీవల మరోసారి సప్లిమెంటరీ పరీక్ష నిర్వహించింది. ఇందులో 105 మంది పరీక్ష రాయగా నలుగురు గైర్హాజరయ్యారు. గురువారం ప్రకటించిన ఫలితాల్లో 40మంది ఉత్తీర్ణులు కాగా, 65 మంది ఫెయిలయ్యారు. తొలి విడతలో పాసైన నలుగురితో కలిపి 45 మంది ఉత్తీర్ణులు కాగా, వీరికి త్వరలో అసెస్మెంట్ పరీక్ష నిర్వహిస్తామని జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రాజేందర్ తెలిపారు.

## ఎట్టకేలకు టీచర్ల సర్దుబాటు

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో వివిధ పాఠశాలలకు అవసరమైన ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తూ డీఈవో ఖుష్బూ గుప్తా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. దసరా సెలవులకు ముందే సర్దుబాటు ప్రక్రియ పూర్తి చేయగా ఉత్తర్వులు జారీ చేయడంలో ఆలస్యమైంది. మొదటి విడతలో 131 మందిని, ప్రస్తుతం 39 మందిని.. మొత్తంగా 100 మందిని సర్దుబాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం సర్దుబాటు అయినవారిలో స్కూల్ అసిస్టెంట్ బయోసైన్‌లో ఇద్దరు, ఇంగ్లీష్‌లో ఇద్దరు, గణితంలో ఇద్దరు, తెలుగులో ఒకరు, ఫిజికల్ సైన్‌లో ఒకరు, సాం ఘిక శాస్త్రంలో నలుగురు, ఎస్జీటీ విభాగంలో 26మంది ఉన్నారు.

## 'సాత్నాల' నుంచి నీటి విడుదల

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**
మండలంలోని సాత్నాల ప్రాజెక్టుకు 1,605 క్యూసెక్కుల ఇన్ కొనసాగింది. గురువారం మూడు గేట్లు ఎత్తి 2, 380 క్యూసెక్కులను దిగువకు వదిలినట్లు జేఈ దీపక్ తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1.24 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 1,046 టీఎం సీలు ఉన్నట్లు వెల్లడించారు. పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల్లో చేపల వేటకు వెళ్ల వద్దన్నారు.







# ముంచెత్తిన ముసురు
# ఎడతెరిపి లేకుండా వర్షం



- ప్రాజెక్టులకు పోటెత్తుతున్న వరద
- ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి.. రాళ్లవాగు
- ఉప్పొంగుతున్న వాగులు.. వంకలు
- నీట మునిగిన పత్తి, వరి, మొక్కజొన్న పంటలు
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ■ నిలిచిన ఉత్పత్తి





**మంచిర్యాల/ఆసిఫాబాద్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**
అల్పపీడన ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ముసురు మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలను ముంచెత్తుతున్నది. బుధవారం రాత్రి నుంచి వర్షం పడుతుండగా, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రాజెక్టుల్లోకి భారీగా వరద వచ్చి చేరుతుండగా, గేట్లు ఎత్తి దిగువకు వదులుతుండడంతో వాగులు వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పంట పొలాలు నీట మునిగాయి. మంచిర్యాల జిల్లా కేంద్రంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలు చిత్తడిగా మారాయి. జిల్లా వ్యాప్తంగా గురువారం ఉదయం వరకు 26.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి 40 గేట్లు ఎత్తి 640340 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతుండగా, సమీపంలోని గౌతమేశ్వర ఆలయం ముందు వరకు నీటిప్రవాహం వచ్చింది. పుష్కరఘాట్‌లు మునిగిపోయాయి. మరోవైపు మంచిర్యాల పట్టణ సమీపంలోని రాళ్లవాగు నిండుగా ప్రవహిస్తోంది. గోదావరినదిలో రాళ్లవాగు కలిసే చోట నీరు వెనక్కి తన్నుతున్నది. రాళ్లవాగు ప్రవాహం ఇంకా పెరిగితే సమీపంలోని కాలనీల్లోకి నీరు వచ్చిచేరే అవకాశమున్నది. చెన్నూర్‌లో మహంకాళి వాడకు చెందిన మధు ఇంటి గోడ కూలిపోయింది. మందమర్రి మండల పరిధిలోని బొక్కల గుట్ట గ్రామ శివారు గాంధారిఖిల్లా సమీపంలోగల గండి పడిన మేడి చెరువును కలెక్టర్ కుమార్ దీపక్, తహశీల్దార్ సతీశ్‌కుమార్, ఇరిగేషన్ డీఈ శారద, సిబ్బందితో కలసి పరిశీలించారు. వరద పరిస్థితులపై ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. జైపూర్ మండలంలో గోదావరి నిండుగా ప్రవహిస్తున్నది. సుందిళ్ల ప్రాజెక్టు 74 గేట్లు ఎత్తడంతో వరద దిగువకు వెళ్తున్నది. గోదావరి సమీప గ్రామాలైన వేలాల, కిష్టాపూర్, పౌనూర్, శివ్వారం గ్రామాల్లో పత్తి, వరి పంటలు నీట మునిగాయి. ఎల్లంపల్లి ప్రాజెక్ట్ గేట్లను తెరవడంతో అన్నారం బరాజ్‌లోకి భారీగా వరద వస్తున్నది. సీఐ దేవేందర్ రావు అన్నారం బరాజ్‌ను సందర్శించారు. అన్నారం బరాజ్, గోదావరి వైపు వెళ్లవద్దని ప్రజలకు సూచించారు. రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఏడీఏ బానోత్ ప్రసాద్ తెలిపారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో 34 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జూబ్లీ మారెట్ వద్ద డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక వర్షపు నీరు రోడ్లపై నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జన్కాపూర్ సబ్ జైలు వెనకాల ఉన్న తిరుపతికి చెందిన ఇల్లు కూలింది. బెజ్జూర్-సోమిని రూట్‌లో సుస్మీర్, కుశ్నపల్లి వాగులు ఉప్పొంగాయి. వంతెనలు లేకపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. సుస్మీర్, సోమిని, మొగవెల్లి, ఇప్పలగూడ, నాగపల్లి తదితర గిరిజన గ్రామాలకు సంబంధాలు తెగిపోయాయి. బెజ్జూర్-గూడెం సోమిని మీదుగా వెళ్లాల్సిన రోడ్డు కోతకు గురైంది.

**ప్రాజెక్టులకు పోటెత్తుతున్న వరద...**
ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి దిగువకు నీటి విడుదల కొనసాగుతున్నది. ప్రాజెక్టు సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా, 15.9331 టీఎంసీల నీరు ఉన్నది. శ్రీరాంసాగర్ నుంచి 341000 క్యూ సెక్కులు, కడెం ప్రాజెక్టు నుంచి 4144 క్యూ సెక్కులు, వర్షంతో 258232 క్యూ సెక్కులు నీరు వచ్చి చేరుతున్నది. హైదరాబాద్ తాగునీటి అవసరాలకు 288 క్యూ సెక్కులు, ఎన్టీపీసీకి 121 క్యూ సెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. 40 గేట్లు ఎత్తి 638035 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఇక కుమ్రం భీం ప్రాజెక్టు 5వ గేటు 0.3 మీటర్లు ఎత్తి 550 క్యూసెకుల నీటిని దిగువకు వదిలారు. ప్రస్తుతం ఇన్‌ఫ్లో 680 క్యూసెక్కులు ఉంది.

**బొగ్గు ఉత్పత్తికి ఆటంకం...**
అల్పపీడన ద్రోణి ప్రభావంతో సింగరేణి ఉపరితల గనులకు వాన గండం ఎదురైంది. బుధవా రం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో భారీగా బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలిగింది. జిల్లాలోని రామగుండం రీజీయన్ పరిధిలోని ఓసీపీ- 1,2,3,5 ఉపరితల బొగ్గు గనుల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో గురువారం మొదటి షిఫ్టు నుంచి ఉత్పత్తి నిలిచిపోయింది. ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టుల్లో బొగ్గు ఉత్పత్తి చేసే భారీ యంత్రాలు ఎక్కడికక్కడే పని స్థలాల్లోనే నిలిచిపోయాయి. రాత్రి నుంచి కురుస్తున్న వర్షంతో ఓసీపీల క్వారీల్లోకి వరదనీరు చేరడంతో ఉదయం నుంచి ఉత్పత్తికి ప్రతికూల పరిస్థితి ఏర్పడింది. రీజీయన్‌లో ఒక్కరోజే దాదాపు 40 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి నష్టం కలిగినట్లు తెలుస్తోంది. క్వారీల్లో చేరిన వరద నీరును ఎత్తిపారపోసేందుకు మోటార్లు బిగించి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది.









# సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం

అర్హులైన వారికే ఇందిరమ్మ ఇండ్లు
ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్
ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ



**ఉట్నూర్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**
ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ... నిరుపేద ఇళ్లులేని వారికి ఇందిరమ్మ ఇండ్లను ఇస్తున్నామని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. గురువారం ఉట్నూర్ మండలంలోని కుమ్మరికుంట, దొంగచింత గ్రామాల్లోనీ ఆదివాసీల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు. పేదోడి సొంతింటి కళలను సాకారం చేయడంలో ప్రజా ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. అనంతరం ఉట్నూర్ మండల కేంద్రంలోని కేబీ కాంప్లెక్స్ లోని అడ్వాన్స్ ఐటీఐ కళాశాలను సందర్శించారు.మారుమూల గ్రామీణ ప్రాంతాల యువతి, యువకులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం కోట్ల రూపాయలతో అడ్వాన్స్ ఐటీఐలను నిర్మించిందన్నారు. ఆదిలాబాద్ ఆర్టీఐ మెంబర్ దూట రాజేశ్వర్, జైనూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జైవంతరావు, నాయకులు ప్రభాకర్, చంద్రయ్య, ఇక్బాల్, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



# గులాబీ గూటికి కోనేరు కోనప్ప బ్రదర్స్


**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**
సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, ఆయన సోదరుడు, మాజీ జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు బీఆర్ఎస్‌లో చేరారు. గురువారం హైదరాబాద్‌లోని ఎర్రవెల్లిలోని ఫాం హౌస్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు సమక్షంలో చేరగా, వారు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. గతేడాది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కోనప్ప కాంగ్రెస్‌లో చేరారు. ఏడాది పూర్తి కాకుండానే అధికార పార్టీని వీడారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న రావి శ్రీనివాస్‌ను ఆ పార్టీ సస్పెండ్ చేయగా, తాజాగా వీరిద్దరు కాంగ్రెస్‌ను వీడడంతో ఆ పార్టీకి గట్టి దెబ్బ తగిలినట్లయ్యింది. ప్రస్తుతం కాంగ్రెస్‌లో ఎమ్మెల్సీ దండే విఠల్ వర్గం మాత్రమే ఉన్నది. కోనేరు బ్రదర్స్ చేరికతో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మాంతయ్య ఆధ్వర్యంలో కార్యకర్తలు పటాకులు పేల్చి.. స్వీట్లు పంచిపెట్టారు. మాజీ సర్పంచ్ మౌనిష్, మాజీ ఎంపీటీసీ ఎంకే మండల్, సంతోష్, రవీందర్ గౌడ్ ఉన్నారు.



# కాలం చెల్లిన మందులను ఇవ్వొద్దు

దంతన్‌పల్లి పీహెచ్‌సీని తనిఖీ చేసిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

**ఉట్నూర్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**
ఆస్పత్రికి వచ్చే రోగులకు కాలం చెల్లిన మందులను రోగులకు ఇవ్వద్దని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం మండలంలోనీ దంతన్‌పల్లి పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని ల్యాబ్, ఫార్మసీ రూమ్ పరిశీలించి, టాబ్లెట్స్‌ను పరిశీలించారు. మందులపై ఎక్స్ పైరీ డేట్‌ను స్వయంగా



పరిశీలించి, మందుల స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. గర్భిణి స్త్రీలకు మెరుగైన వైద్యాన్ని అందించాలని, మారుమూల గ్రామీణ ప్రాంతాలలోనీ డెలివరీ అయ్యే మహిళలను ముందస్తుగా గుర్తించి ఆసుపత్రిలో చేర్చుకోవాలని డాక్టర్లకు సూచనలు చేశారు. భారీ వర్షలు కురుస్తున్న నేపథ్యంలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా సాఫ్ట్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY

# జల్ సంచయ్ జన్ భగీదారి అవార్డుకు ఎంపిక

## మొదటి స్థానంలో అదిలాబాద్ జిల్లా

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**
జల్ సంచయ్ జన్ భగీదారి అవార్డుకు అదిలాబాద్ జిల్లా మొదటి స్థానంలో ఎంపిక కావడం జరిగిందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పూర్తి అయిన 98 వేల 697 పనులను కేంద్ర బృందంచే తనిఖీ చేసిన అనంతరం జిల్లాలో భూగర్భ జలాల అభివృద్ధికై ఎంతో లాభం జరిగిందని శాస్త్రజ్ఞులు ఖరారు చేస్తూ భావితరాలకు, వ్యవసాయ ఆధారిత పనులకు ఎంతో లబ్ది చేకూరుతుందని తెలుపుతూ 2 కోట్ల రూపాయల అవార్డు జిల్లాకు కేంద్రం ప్రకటించిందని తెలిపారు.





## కుష్మండ అవతారంలో

# సరస్వతీ అమ్మవారి దర్శనం

**ముథోల్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**
ప్రసిద్ధ పుణ్యక్షేత్రం చదువుల తల్లి కొలువుదీరిన బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవి సన్నిధిలో శరదియా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. నాల్గవ రోజు అమ్మవారు కూష్మాండా అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. నవరాత్రులలో అమ్మవారి నాలుగవ స్వరూప నామం కూష్మాండ 'కు' అంటే చిన్న, 'ఊష్మ' అంటే శక్తి, 'అండా' అంటే విశ్వం. తన శక్తితో ఈ విశ్వాన్ని సృష్టించింది అని అర్ధం. ఎనిమిది భుజాలు కలిగి విరాజిల్లుతుంది. కుష్మాండా దేవి 8 చేతులతో ఉంటుంది. ఆ చేతులలో చక్రం, ఖడ్గం, గద, పాశం, ధనువు, బాణాలు, ఒక తేనె భాండం, ఒక రక్త భాండం ఉంటాయి. ఈ విశ్వం లేనప్పుడు, అంతా చీకటే అలుముకున్నప్పుడు ఈ విశ్వాన్ని సృష్టించి, తన చిరునవ్వుతో వెలుగును ప్రసాదించింది అమ్మవారు. అమ్మవారికి అర్చకులు ప్రత్యేక తమళార్చన చేసి హారతి నిచ్చి అల్లం గారెలను నైవేద్యంగా సమర్పిచారు. తెలుగు రాష్ట్రాలతో పాటు, మహారాష్ట్ర నుండి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని చిన్నారులకు అక్షరాబ్యాస పూజలు జరిపించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

# 27 నుంచి అంగన్వాడీ కేంద్రాలకు దసరా సెలవులు

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 25 (ప్రభాత సమాచారం)**
తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని అంగన్వాడీ కేంద్రాలకు తొలిసారిగా దసరా సెలవులు ప్రకటించింది. రేపటి నుండి మొత్తం ఎనిమిది రోజుల పాటు సెలవులు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 27 నుంచి వచ్చే నెల నాలుగు వరకు అంగన్వాడీలకు దసరా సెలవులు ప్రకటించింది. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల విజ్ఞప్తి మేరకు దసరా సెలవులు మంజూరు చేయాలని అధికారులకు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆదేశించారు. టేక్ హోమ్ రేషన్ విధానంలో లబ్ధిదారులకు పోషకాహారాన్ని అందజేయాలని సూచించారు. అంగన్వాడిల చరిత్రలో మొట్టమొదటిసారిగా అంగన్వాడీలకు సెలవులు ప్రకటించారు.